# మిసిమి

మాస పత్రిక

మార్చి 2007



రూ.8/-



చిత్రకారుడు : నందలాల్ బోస్ (1882-1966)



శివ - సతి

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 18 | మార్చి 2007 | సంచిక 3

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక


| | |
|---|---|
| సురక్షే రచనావిష్కారానికి జనని | మూలం : సచ్చిదానంద రౌత్రాయ్<br>అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| భారతీయ కళకు నవోదయం - నందలాల్ బోస్ | కాండ్రేగుల నాగేశ్వరరావు |
| అరణ్యరోదన | సి.వి. సర్వేశ్వర శర్మ |
| ఆనంద కుమారస్వామి - భారత దేశంతో అనుబంధం | డా॥ కడియాల రామమోహనరాయ్ |
| తెలుగు భాషా ప్రాచీనత - చర్చ | కె. పద్మావతి |
| జెన్ - లకాన్ | మ. శివరామకృష్ణ |
| కళాతాత్త్విక సిద్ధాంత ఆవిష్కరణ అవసరం | డా॥ ఎ. రవీంద్రబాబు |


విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : సతి

చిత్రకారుడు: నందలాల్ బోస్

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimireddy@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# వినతి

2007, మే నెల 2వ తేదీన బౌద్ధ ప్రపంచమంతా బుద్ధపూర్ణిమ పండుగను జరుపుకొంటుంది. ఆ పండుగను పురస్కరించుకొని 'మిసిమి'ని బుద్ధ జయంతి విశేష సంచికగా వెలువరించదలిచాము. ఆ సంచికకు బౌద్ధం మీద మీ అమూల్య రచనలను, అచ్చులో 5, 6 పుటలకు మించకుండా రాసి, ఏప్రిల్ 15వ తేదీలోగా పంపవలసిందిగా మా పాఠక రచయితలను, ఇతర రచయితలను కోరుతున్నాము. సహకరించండి.

\- సంపాదకుడు

## Statement about ownership and other Particulars of MISIMI

## FORM IV (SEE RULE - 8)

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | Alapati Bapanna |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 5. | Editor's Name | : | ANNAPAREDDY VENKATESWARA REDDY |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**ALAPATI BAPANNA**
Publisher

Date : March 1, 2007.



సచ్చిదానంద రౌత్రాయ్
(1916-2004)

# సురక్షె రచనావిష్కారానికి జనని

1986వ సం॥ జ్ఞానపీఠ్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసంలోని ముఖ్యాంశాలు (ఒరియా నుండి హిందీలోకి అనువదించబడిన ఉపన్యాసానికి తెలుగు అనువాదం)

అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి



భారతీయ సాహిత్యం ఎన్నో భాషల్లో రాయబడుతున్నప్పటికీ దాని ఆత్మ ఒకటే అని అన్నారు డా॥ రాధాకృష్ణన్. భారతదేశం ఎన్నో భాషా ప్రాంతాలుగా విభజింపబడి ఉందని, ఆయా ప్రాంతాల్లో రాజ్యాంగంలో పేర్కొన్న భాషలు మాట్లాడుతారనీ మనకు తెలుసు. ప్రతి భాషకు విశిష్టమైన సాహిత్యం ఉంది. అయినా అన్ని సాహిత్యాల్లో అభివ్యక్తి పొందిన ఆలోచనలు, భావాలు, సంవేదనలు సమానమే. ఒకే నియతికి సంబంధించిన భావన, ఒకే గొప్ప సాంస్కృతిక వారసత్వం పట్ల జాగరూకత, ఈ అన్ని సాహిత్యాల్లో ప్రవహిస్తూ ఉంది. పండిత్ నెహ్రూ ఈ స్థితిని మరింత స్పష్టం చేశారు. ఆయన భారతదేశ భాషల మూలాలు, ప్రేరణలు, చాలా వరకు ఒకే విధంగా ఉన్నాయని, అవి వికసించిన మానసిక వాతావరణం ఒకే విధంగా ఉందని, అన్నారు. భారతదేశంలోని ప్రతి సాహిత్యం, అది హిందీ, ఉర్దూ, తెలుగు, తమిళ్, మళయాళం, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ, ఒరియా, అసమియా, ఏ భాషలో ఉన్నా మొత్తం దేశ ఆలోచనా విధానానికి, సంస్కృతికి, ఒకే పద్ధతిలో ప్రాతినిధ్యం వహిస్తుంది. దీనికి తోడు మనమందరం స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత, రెండు కాలాల్లోనూ పాశ్చాత్యీకరణ, పారిశ్రామికీకరణ అనే రెండు ప్రభావాల కారణంగా ఒకే విధమైన అనుభవాన్ని, స్థితిని పొందాము. అందుచేత భారతదేశంలోని ప్రతి భాషా సాహిత్యంలో సామాజిక పరిస్థితులతో పాటు, సామాజిక విషయ దృష్టిలో కూడా సమానత కనిపిస్తుంది.

మనం ఇంగ్లాండు, అమెరికాలలో వెలువడుతున్న ఇంగ్లీషు సాహిత్యాన్ని; ఫ్రాన్సు, జర్మనీ, రష్యా, స్కాండినేవియా మొదలైన దేశాల్లోని సాహిత్యాలను ఇంగ్లీష్ అనువాదాల ద్వారా చాలా ఎక్కువగానే చదువుతున్నప్పటికీ, మన పొరుగు రాష్ట్రాల్లోని రచనల గురించి, సమృద్ధమైన, చైతన్యవంతమైన భారతీయ సాహిత్యం గురించి మనకు చాలా తక్కువగానే తెలుసు. ఇది నిజంగా ఒక దయనీయమైన స్థితి.

సాహిత్యం భాషకు సంబంధించిన అన్ని అడ్డంకులకు అతీతంగా ఉంటుంది. అది ప్రతి మనిషికి చెందిన వారసత్వం కూడా. మన దేశంలోని సాహిత్య సముదాయాల మధ్య ఇప్పటికీ భాషకు సంబంధించిన అడ్డంకులు సంప్రేషణలో అఘాతం సృష్టించి ఉన్నాయి. అందువల్ల సాహిత్యంతో సంబంధం ఉన్న వ్యక్తులందరు ప్రతి భారతదేశ భాషలోని విశిష్ట రచనలను ఇంగ్లీషులోకి, హిందీలోకి, అనువదించే ప్రయత్నం చేయవలసిన సమయం వచ్చింది. ఇందువల్ల మనదేశంలోని పాఠక సముదాయమే కాక, ఇతర దేశాలలోని పాఠకులు కూడా ఈ రచనలు చదివి ఆనందించ గలుగుతారు.

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్సిటీలో హిందీ ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. నివాసం న్యూఢిల్లీ.

భారతీయ సాహిత్యం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది తనకు తగిన స్థానాన్ని పొందగలుగుతుంది. ఏ సాహిత్య రచన అయినా, ముఖ్యంగా కవిత్వం, ఇంగ్లీషులోకి అనువదింపబడినప్పుడు తన గాంభీర్యాన్ని, నుడికారాల సూక్ష్మ భేదాన్ని, స్థానికమైన చవులను, లయాత్మక ఆనందాన్ని, చాలా వరకు పోగొట్టుకుంటుందనే మాట వాస్తవమే. కాని అనువాదానికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయం ఇప్పట్లో ఏదీ లేదు. ఇంతే కాక, గొప్ప కవిత్వం అనువాదంలో కూడా తన శక్తిని చాలా వరకు నిలుపుకోగలుగుతుందని నా నమ్మకం. అలాంటప్పుడు కథ, నవల, నాటకం, వీటికి అనువాదంలో జరిగే హాని చాలా తక్కువే. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగంలో గుర్తింపు పొందిన భాషలలోని శ్రేష్ఠ రచనలను ఇంగ్లీషులోకి అనువదించి ప్రచురించే ఒక సంస్థను రూపొందించడం అవసరమని కూడా నాకు తోస్తుంది.

వైశాల్యం, జనసంఖ్య, రెండింటిలో భారతీయ ద్వీపకల్పం కంటే చాలా చిన్నవైన కొన్ని దేశాల - ఉదాహరణకు చిలీ, ఐస్‌ల్యాండ్, నైజీరియా లాంటి దేశాల - సాహిత్య రచనలు ఇప్పటికే విశ్వ సాహిత్యంలో గుర్తింపు పొంది ఉండడాన్నీ, భారతీయ సాహిత్యం వైపు ఎవరి దృష్టీ పోకుండా ఉండడాన్నీ నిజంగానే విధివైపరీత్యంగానే భావించాలి. ఇందుకు ఒక దృష్టాంతం మీ ముందు ఉంచదలచుకున్నాను. న్యూయార్క్ నివాసి, నోబుల్ పురస్కార విజేత అయిన సింగర్ తన కథలు వేగంగా అంతరించి పోతున్న యెడ్డిశ్ అనే ఒక మాండలికంలో రాశాడు. యెడ్డిశ్ పోలిష్ భాషకు చెందిన ఒక మాండలికం. దీన్ని మాట్లాడే వారు మహా అయితే ఇరవై వేల మంది ఉంటారు. కాని ఇంగ్లీషు, ఫ్రెంచి భాషల్లోకి అనువదించబడిన తన రచనల ద్వారా ఆయన అంతర్జాతీయ పాఠక సముదాయాన్ని చేరుకో గలిగారు.

మన దేశంలో ఏ రచయిత కూడా ఆర్థికంగా తాను సురక్షితంగా ఉన్నట్లు భావించుకోవడం లేదు. అతడు కవి అయితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. ఏ రచయిత అయినా నేటి విషయంలో సురక్షితంగాను, రేపటి గురించి నిశ్చింతతోను, ఉన్నట్లు భావించుకో లేకపోతే, శాశ్వతమైన రచన ఏదీ చేయలేడు. ఇప్పటికి దాదాపు 27 సంవత్సరాల పూర్వం 1955లో హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో 'కళ - శాస్త్ర విజ్ఞానం' అనే అంశం పై జరిగిన ఒక అంతర్జాతీయ చర్చా గోష్ఠిలో నేనన్నట్లు, భారత దేశంలో సాహిత్యం ఒక మంచి షికారు బెత్తమే గాని, నమ్మికోదగిన చంకకర్ర మాత్రం కాదు. ఆ తర్వాత శతాబ్దిలో నాలుగవ వంతు కాలం గడిచినా పరిస్థితిలో ఏమీ మార్పు రాలేదు. భారతదేశంలో నిజాయితీపరుడైన ఏ సాహిత్యకారుడు కూడా, ముఖ్యంగా కవి, కేవలం తన పుస్తకాలతో వచ్చే రాయల్టీతో జీవించలేడు. తనను, తన కుటుంబాన్ని పోషించుకొనేందుకు, అతడు ప్రభుత్వంలోగాని, వ్యాపార, లేక విద్యా సంస్థల్లో గాని ఏదో ఒక ఉద్యోగం చేయడానికి వివశుడవుతున్నాడు. సాహిత్య కార్యకలాపాలు అతనికి విశ్రాంతి సమయంలో చేసే అదనపు పనులుగా ఉంటున్నాయి. అందువల్ల, అతడు తప్పనిసరిగా సమాజపు ముఖ్యధార నుండి వేరయిపోతాడు. అతని రచనలు వ్యక్తివాద రచనలుగానో, నిగూఢమైనవిగానో అయిపోతాయి. చివరకు ఖడ్గం కంటే శక్తివంతమైన తన కలంతో జీర్ణించిన సామాజిక స్థితిని గాని, దాని విలువల విధానాన్ని గాని మార్చడానికి బదులు తానే వాటి చేతి కీలుబొమ్మగా ఉండి పోతాడు. ఒక రచయిత స్వతంత్రంగా, స్వచ్ఛందంగా జీవించ గలిగేవాడుగా ఉండాలి. 'ఆవశ్యకత ఆవిష్కారానికి జనని' అనేది చాలా ప్రాచీనమైన సూక్తి. అంటే ఆవిష్కారాలు చేస్తూ ఉండడానికి అవసరాలు, పేదరికం ఎల్లప్పుడూ మనిషిని చుట్టుకొని ఉండాలని. ఈ సూక్తికి చార్లెస్ డికెన్స్ కాలంలో ఆధారం దొరికింది. అప్పుడు పెట్టుబడి దారీ విధానం తన ఆరంభ దశలో

ఉంది. కాని నేటి మానవుడు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్న సమయంలో ఆ సూక్తికి ప్రాధాన్యత ఎంత మాత్రం లేదు. సమాజం, ప్రభుత్వం, రచయితకు ట్రస్టీగాను, సంరక్షక శక్తిగాను, ఉంటాయి కాబట్టి అవి వారి బాగోగుల బాధ్యత స్వీకరించాలి. ఎందుచేతనంటే రచయిత సమాజం కోసం రాస్తాడు. తన కోసం, తన కుటుంబం కోసం రాయడు. ఇప్పుడు పై సూక్తిని ఇలా తిరగ రాయాలి: 'సురక్ష (safety) ఆవిష్కారానికి జనని.' లేమి, పేదరికం కాదు. ఒరిస్సా సాహిత్య అకాడెమీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు (1978-81) నేను ఒరిస్సాలోని రచయితలు, చిత్రకారులు, మూర్తి కారులు, సంగీతకారులు, నర్తకులు, నటులు, ఆటగాళ్ళు, లాంటి కళాకారులకు జీవితాంతం నెలకు రూ.200 మొదలుకొని రూ.500 వరకు పెన్షన్ (ఇప్పటి అసాధారణ మూల్యవృద్ధి కారణంగా దీన్ని పెంచవలసిన అవసరం ఉంది) ఇప్పించడానికి ప్రయత్నించాను. రాష్ట్ర ప్రభుత్వం నా ప్రతిపాదనను స్వీకరించినందువల్ల ఈ రోజు దాదాపు 500 మంది రచయితలు, కళాకారులు, ఆటగాళ్ళు ఆ పెన్షన్ పొందుతూ ఉండడం నాకు చాలా సంతోషం కలిగిస్తూ ఉంది.

నా రచనా వ్యాసంగంలో కవిత్వానికే మొదటి స్థానం ఉన్నప్పటికీ, నేను కథ, నవల, నాటకం, విమర్శ, పరిశోధన లాంటి ఇతర ప్రక్రియల్లో కూడా రాశాను. ప్రతి కవి తనకు తెలియకుండానే ఒక విమర్శకుడు కూడా అయి ఉంటాడని నా నమ్మకం. ఎందుచేతనంటే కవిత్వం రాసేటప్పుడు అతడు కొన్ని పదాలను ఎన్నుకోవలసి ఉంటుంది, కొన్నింటిని త్యజించవలసి ఉంటుంది. వాటిలో సమతూకం ఏర్పరచవలసి ఉంటుంది, రూపకాల్లాంటి వాటిలో వాటిని పొందుపరచ వలసి ఉంటుంది. అందువల్ల డ్రైడన్, కార్లాయల్, మాథ్యూ ఆర్నాల్డ్, ఇలియట్ మొదలైన మహాకవులందరు తమ కాలంలో గొప్ప విమర్శకులుగా కూడా ఉన్నారనే ఇంగ్లీషు వారి మాట నాకు ఆశ్చర్యం కలిగించదు.

ఇప్పుడు నేను ఆధునిక సాహిత్యానికొస్తాను. ఆధునికతగాని, ఆధునికతావాదం గాని సంప్రదాయానికి తర్కబద్ధమైన, చారిత్రకమైన పరిణామం. పాశ్చాత్య విద్వాంసులు, భారతీయ విద్వాంసులు ఆధునికత కిచ్చిన నిర్వచనాలు చాలానే ఉన్నాయి. కొందరు దీన్ని వికాసం పొందుతున్న దేశాలలోని పాశ్చాత్యీకరణకు, పారిశ్రామీకరణకు సమానమైనదిగా భావించారు. ఎందుచేతనంటే దీని మూలాలు శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో ఉన్నాయి కాబట్టి. కొందరు దీన్ని పట్టణీకరణకు సమానమైందిగా కూడా భావించారు. ఈ ఘటకాలు వీటినుండి ఉబికి వచ్చే ఆధునికతావాదాన్ని, ఆధునిక సంవేదనను చాలా వరకు ప్రభావితం చేసిన మాట వాస్తవమే అయినా ఆధునికతను నిర్ణయించడానికి కేవలం ఇవే కొలమానాలు కావు. ఉదాహరణకు మనం ఏదైనా ఒక ఫాసిస్టు సమాజాన్ని లేక ఫాసిస్టు సాహిత్యాన్ని కేవలం నాజీ జర్మనీ పారిశ్రామీకరణ దృష్టితో, పట్టణీకరణ దృష్టితో పరాకాష్ఠకు చేరుకుందనే కారణంగా ఆధునికమైనట్లుగా భావించలేము. ఎందుచేతనంటే పారిశ్రామీకరణకు, పట్టణీకరణకు ముందు ఉన్న సమాజం ఎంత క్రూరంగా, అమానవీయంగా ఉండేదో, అంతే క్రూరంగా, అమానవీయంగా ఈ సాహిత్యం కూడా ఉండింది. అందువల్ల ఒక్క మానవతావాదమే ఆధునిక వాద సారంగానూ, దాని నిర్మాణాత్మక ఘటకంగానూ ఉండగలదు.

ప్రతియుగానికి, సమాజానికి తనదైన ఒక ప్రత్యేకమైన విన్యాసం, లేక ఆకృతి ఉంటుంది, విలువల పద్ధతి ఉంటుంది, సౌందర్యం ఉంటుంది, సంవేదనలుంటాయి. ఏ యుగం, లేక ఏ సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకోవాలన్నా సంస్కృతి యొక్క - పరిజ్ఞాన శీలత, నైతికత, సౌందర్య భావన ఈ మూడు పార్శ్వాలను, వీటి గతిశీల సంబంధాల, ప్రతిక్రియల మధ్య క్షుణ్ణంగా తెలుసుకోవలసి ఉంటుంది.

ప్రతి సమాజానికి తనదైన ఒక సామాజిక - ఆర్థిక నిర్మాణం కూడా ఉంటుంది. సామాజిక - ఆర్థిక నిర్మాణం, సమాజం యొక్క సాంస్కృతిక రూపాన్ని, కళ, సాహిత్యం, దర్శనం, నీతి శాస్త్రం, మొదలైన వాటిని - ప్రభావితం చేసినట్లు మార్క్స్ చూపించాడు. కొందరు సమాజశాస్త్రజ్ఞులు సామాజిక కారణాలు చాలా సంక్లిష్టంగా ఉంటాయని, మార్క్స్ యొక్క సరళమైన, ఏకపక్షీయమైన దృష్టిని బహుపార్శ్వ దృష్టితో సవరించవలసిన అవసరముందనీ నొక్కి చెబుతున్నా, మార్క్స్ ఆలోచనల్లో ఉన్న సత్యాంశాలను ఎవరూ అంగీకరించకుండా ఉండలేరు. సామాజిక స్వరూపం కేవలం సామాజిక - ఆర్థిక విన్యాసంపైన నిర్మించబడిన బాహ్య సంరచన, అని మార్క్స్ వాదించాడు. కొందరు పండితుల అభిప్రాయం ప్రకారం మార్క్స్ సమాజంలోని ఆలోచనలకు, విలువల విధానాలకు ఉన్న ప్రధానమైన పాత్రను – ఉదాహరణకు ఒక కాలంలో కొన్ని దేశాల్లో జాతీయత నిర్వహించిన ప్రధానమైన పాత్రను – తక్కువగా అంచనావేశాడు. అయినా సామాజిక - ఆర్థిక నిర్మాణం చివరకు దానిపైన ఆధారపడిన ఉత్పాదన సంబంధాలను, విలువల విధానాలను, అంతేగాక కళకు సంబంధించిన కొలమానాలను కూడా ప్రభావితం చేస్తుందనడంలో ఏమీ సందేహం లేదు.

ఆధునిక సంవేదలు మానవుని భావాత్మక వ్యక్తిత్వాన్ని మార్చి వేశాయి. అతడు తనను ప్రతి వస్తువు నుండి వేరు చేసుకోవడమే కాక, తన నుండి కూడా వేరు చేసుకున్నాడు. ఆధునిక సాహిత్యాన్ని ఒంటరితనం, వేరు భావన (alienation) పూర్తిగా ఆక్రమించి వేశాయి. నైరాశ్య (ధనవైభవాల మధ్య నైరాశ్యం) భావాలు, ప్రవృత్తులు, విరక్తి, ఈ ఒంటరి తనానికి లక్షణాలు. ప్రసిద్ధ విమర్శకుడు ఎమ్.ఎమ్. దాస్ ఇలా అన్నాడు: "పట్టణీకరణ, పరిశ్రమల అభివృద్ధి, యుద్ధకారణంగా కలిగిన వినాశకరమైన భయంకర అనుభవాలు, ఈ ఆధునిక సంవేదనలు పుట్టడానికి, వృద్ధి చెందడానికి కారణాలు. కానీ, ఇంతకంటే కూడా తత్త్వమీమాంస యొక్క విఫలత, సాహిత్యానికి, కళకు ప్రధాన ప్రేరణా స్రోతస్సు అయిన ఆస్థ, నమ్మిక సంకట స్థితిలో పడిపోవడమే పెద్ద కారణమేమో! ఈ శతాబ్దంలో అతివేగంగా జరిగిన పట్టణాల, పరిశ్రమల అభివృద్ధి గ్రామ్య జీవితం ఇన్నాళ్ళు సురక్షితంగా ఉంచుతూ వచ్చిన వ్యక్తి నిరుపమానతను రూపుమాపింది. నేటి పట్టణ జీవితంతో పోలిస్తే తీరిక యొక్క సంగీతంతో నిండిన గ్రామ జీవితం, వ్యక్తికి ప్రకృతితో తాదాత్మ్యం స్థాపించుకొని ఉండడానికి ఎక్కువ అవకాశాలు కల్పించేది. నిరంతరం పరివర్తన చెందే నగర జీవిత స్వరూపం కూడా మనిషికి తన మూలాల నుండి వేరు అవుతున్న అనుభూతి కలగడానికి ఒక కారణం. పారిశ్రామికీకరణ మనుషులను పరస్పరం దూరం చేయడంతోనే సమాప్తి చెందలేదు. అది విశేషజ్ఞత (specialisation) ను ప్రోత్సహించి, అతని వ్యక్తిత్వాన్ని ముక్కలు ముక్కలుగా చేసింది. మనిషి నాలుగు వైపులా సంవాద రాహిత్యపు గోడలు లేచాయి. అతడు ఏ స్మృతులూ లేకుండా, ఏ స్థలంతోనూ ఒక సంబంధాన్ని ఏర్పరచుకోకుండా నిరుద్దేశ్యంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఆధునిక కవి అవహేళన పాలవుతానేమో నన్న భయంతో భావుకుడుగా ఉండటానికి అసహజంగా బెదురుతున్నాడు. ఆధునిక కవిత్వంలో ప్రేమ గురించి చాలా వరకు ఒకే వక్తవ్యం (statement) మనకు కనిపించదు. ఎందుచేతనంటే భావుకత్వం దేన్నయితే స్వీకరిస్తుందో బౌద్ధికత దాన్ని తిరస్కరిస్తుంది. ఆక్రోశపరుడుగా ఉండటం సులభం. ఎందుకంటే ఆక్రోశాభివ్యక్తివల్ల ఏ ప్రమాదమూ లేదు. కాని ప్రేమలో సకారాత్మకత (positiveness), విలువల ఉమ్మడితనం, అంతకుమించి జీవితం కంటే కూడా పెద్దదైన నమ్మిక, అంతర్లీనమై ఉన్నాయి. ప్రేమ చాదస్తంతోగాని, అతితెలివితో గాని కలిసి జీవించలేదు.

మనస్తత్వ శాస్త్రం (ముఖ్యంగా ఫ్రాయిడ్, యుంగ్‌ల మనో విశ్లేషణ) మనిషి అసంబద్ధతను తీవ్రతరం చేయడంలో పెద్ద పాత్రనే నిర్వహించింది. మనస్తత్వ శాస్త్రం వివేకంపైన అవివేకపు అదుపు నెలకొని ఉన్నట్లు చెప్పి మనిషి ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించింది. ఈ మనస్తత్వ శాస్త్రమే ఎందరో మనుషుల నివాసాల వాతావరణాన్ని విషపూరితం చేసింది. అది మిత్రుల విషయంలోనూ కుటుంబ సభ్యుల విషయంలోనూ మాత్రమే కాక, స్వయానా తమ విషయంలో కూడా వారి లోపల దాగి ఉన్న ఉద్దేశ్యాల పట్ల సందేహం పుట్టించింది. ఇది ఆధునిక జీవితంలో 'నాయకు'ని కున్న గుర్తింపును కాలరాయడమే కాక, గతంలో గుర్తింపు పొందిన అందరి నాయకత్వం పట్ల కూడా మనలో సంశయం కలిగించింది. బ్రౌనింగ్‌ను గురించి ఇరవయ్యవ శతాబ్దంలో జరిగిన పరిశోధన అతణ్ణి ఒడిపస్ మనోగ్రంథి గ్రస్తుడైన వ్యక్తిగా చూపుతూంది. అందుచేతనే తనకంటే ఎక్కువ వయసున్న స్త్రీ (శ్రీమతి బ్రౌనింగ్ స్వయంగా ఒక కవయిత్రి) ని వివాహం చేసుకున్నాడని చెప్పడం జరిగింది. ఆధునిక జీవితంలోని నైరాశ్యత చాలా వరకు సంపన్నత వల్ల కలిగిన నైరాశ్యత. బౌద్ధికత ఆధిపత్యంలో ఉన్న ఆధునిక యుగానికి తనదంటూ ఒక దృష్టి లేదు. ఎందుచేతనంటే తమ బుద్ధిని అంతర్జ్ఞానానికి, లేక సహజ జ్ఞానానికి సమర్పించడంలో సమర్థులైన వారికే దృష్టి ప్రాప్తిస్తుంది. ఆధునిక యుగపు ఈ సంవేదనలన్నీ నేటి సాహిత్యంలో - కవిత్వంలో, కథా సాహిత్యంలో, అర్థం పర్థం లేని నాటకాల్లో - వ్యక్తమవుతున్నాయి.

ఈ విధంగా ఆధునిక సాహిత్యంలో మనం బౌద్ధికత యొక్క గుడ్డి గొంది చివర వరకు చేరిపోయి ఉన్నాం. ఈ గొంది పైన చావు ముద్రవేయబడి ఉంది, దానికి నలువైపులా గోడలు లేచి ఉన్నాయి. బౌద్ధికత మృత్యువుకు మించి వేరే ఏ సార్థకత వరకూ చేరలేదు. మృత్యువు ఆవలికి చేరడానికి వ్యక్తి అంతర్జ్ఞానం గుండా సాగిపోవలసి ఉంటుంది. ఈ విశాల ఆధునిక సభ్యతతో పాటు సాహిత్యంలో కూడా మనిషి తన బుద్ధి కారణంగా స్వయానా, ఆత్మబలి ఇచ్చిన వాడు (martyre) గా అయిపోయి ఉన్నాడు (Modern Literature, M.M.Das).

సగటు పాఠకుడు, భారతదేశంలో అయితే ఉన్నత విద్య పొందిన పాఠకుడు కూడా, ఆధునిక సాహిత్యాన్ని, ముఖ్యంగా ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోలేడు. అందువల్ల దాన్ని అతడు ఇష్టపడడు కూడా. ఈ అయిష్టతకు సాధారణంగా చెప్పే కారణం ఏమంటే ఈ కవిత్వంలో కొన్ని అందమైన ఆలోచనలు ఉన్నప్పటికి, అది హృదయాన్ని తాకదు, అని. పాశ్చాత్య సాహిత్యంలో కొంత తక్కువగానే అయినా, ఇలాంటి స్థితే నెలకొని ఉందని నా అభిప్రాయం. అమెరికా, యూరప్‌లోని చాలా మంది ప్రముఖులైన కవులు ఇప్పుడు సాంప్రదాయకమైన కవిత్వం, కథా సాహిత్యం, నాటకం, వైపు మళ్ళడం అవసరమని నొక్కి చెపుతున్నారు. తన పుస్తకం 'Senses In Poetry' లో స్పేరో ఆధునిక కవిత్వం 19వ శతాబ్దపు ముఖ్యధార వైపు మళ్ళుతూందని అభిప్రాయపడ్డాడు. ఆధునిక కవి కేవలం పాఠకులనే కాదు, తన్ను తాను కూడా మోసపుచ్చుకుంటున్నాడని ఈస్ట్ మ్యాన్ అభిప్రాయం. ఆధునిక కవిత్వం ఇలియట్, జాయ్స్ రచించిన కొంత తేజోద్దీప్త కవిత్వాన్ని మినహాయిస్తే, మొత్తానికి గొప్ప కవికెవరికీ జన్మ నివ్వలేదని స్టీఫెన్ స్పెండర్ అన్నాడు. కార్ల్ షైప్పిరో ఆధునిక కవిత పాఠక సముదాయానికి ఎక్కువ అస్పష్టంగా, దురూహ్యంగా తయారవుతూ ఉందని అభిప్రాయపడ్డాడు. ఇంతకంటే ఇంకా ముందుకు వెళ్ళడమంటే మరింత విఖండన, మరింత నైరూప్యత, మరింత అస్పష్టత అన్నమాట.

నేను నా జీవితంలో చాలా సంవత్సరాలు ప్రజా ఉద్యమాల్లో గడిపాను, స్వాతంత్ర్యోద్యమంలో, రాజ సంస్థానాల ప్రజా ఉద్యమాల్లో, విద్యార్థుల, రైతుల ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొన్నాను. ఆ

రోజుల్లో కొన్ని నా కవితలు జప్తు అయిపోయాయి. కాని, అవి నిస్సందేహంగా ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనించాయి. నేను ప్రజల నుండి గొప్ప ప్రేరణ పొందాను. అది నా జీవితంలో చిరస్మరణీయంగా ఉంటుంది. నేను రమణీయ గ్రామ దృశ్యాలను చిత్రించే మధురమైన కవితలు కూడా రాశాను, నా గ్రామవాసుల సరళ జీవితాన్ని, వారి జీవితంతో కలగలసి ఉన్న ప్రశాంత ప్రకృతి దృశ్యాలనూ చిత్రించాను. అవి బహుళ ప్రచారం పొందాయి. వాటిలో చాలా రచనలు ప్రజలకు గుర్తుండి పోయాయి కూడా. తొలి కవితలకు పోల్చి చూస్తే, నా ఆధునిక కవితలు అంత జనాదరణ పొందలేదు. వాటిలో లయకు, ఛందస్సుకు ప్రధానమైన స్థానం లేకపోవడం కూడా ఇందుకు కారణం. బింబవాదం, అతి యథార్థవాదం, ప్రతీకవాదం, లాంటి వేర్వేరు వాదాలలో విభజింపబడిన నా ఆధునిక కవితలు సగటు పాఠకుల హృదయాన్ని స్పర్శించలేక పోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఈ సగటు పాఠకుల్లో విద్యావంతులైన మధ్య తరగతి వారు చాలా మంది ఉంటారు. వారు పాశ్చాత్య దేశాల ఆధునిక సాహిత్యంతోను, సాహిత్య ఉద్యమాలతోను పరిచయం కలిగిన వారై కూడా ఉంటారు. అయినా నా కవితలకు ఈ స్థితి తప్పలేదు.

వర్తమాన యుగం కళ, సాహిత్య వికాసాలకు ప్రతికూలమైన యుగం. ఎందుచేతనంటే ఇది విరోధాభాసాలతో, పరస్పర విరోధాలతో నిండి ఉండి ఉంది కనుక. ఎటుచూసినా భ్రష్టాచారం, పీడకశక్తుల బలిమి, కనబడుతున్నాయి. జాతీయ ఐక్యతకు రూపాన్నిచ్చే భాషను, మతాన్ని ఆ జాతినే ముక్కలు ముక్కలుగా చేయడానికి, అరాచకత వ్యాపింపచేయడానికీ ఇప్పుడు ఆయుధాలుగా ఉపయోగించడం జరుగుతూంది. ఈ పరిస్థితుల్లో జాతీయ ఐక్యతను దృఢ పరచడానికి, తన ప్రయోజకత్వాన్ని పోగొట్టుకొన్న పతనశీల సామాజిక స్థితులను పూర్తిగా మార్చివేయడానికి సాహిత్యం ఒక సార్థకమైన పాత్రను నిర్వహించాలి. కవులను, రచయితలను ఆత్మయొక్క ఇంజనీర్లని అంటూ ఉంటారు. వారు మనం కలలు గన్న నవభారత నిర్మాణంలో తప్పని సరిగా గొప్ప తోడ్పాటు అందించగలరు.

### జీవిత విశేషాలు, సాహిత్య పరిచయం:

ఒరియా కవి సచ్చిదానంద రౌత్రాయ్ 1816లో జన్మించారు. స్కూల్లో చదువుతున్న రోజుల్లోనే తన మొదటి కవిత రాశారు. 1932లో ఆయన మొదటి కవితా సంపుటి వెలువడింది. అప్పుడు ఆయన వయసు 16 ఏండ్లు. ఒక సంవత్సరం తర్వాతనే 1937లో కావ్య నాటక రూపంలో ఆయన రెండవ రచన వెలువడింది. ఆ తర్వాత నిరంతరం కొనసాగిన తన కావ్య సాధనలో 18 కవితా సంపుటాలు, 4 కథా సంపుటాలు, 1 నవల, 1 కావ్యనాటకం, 3 సాహిత్య విమర్శకు సంబంధించిన రచనలు, సాహిత్య మూలాల గురించిన ఒక ప్రధానమైన పరిశోధన గ్రంథం వెలువరించారు.

1939లో ఈయన పెద్ద కవిత 'బాజీరావుత్' ప్రచురింప బడడంతోటే ఈయన అందరి దృష్టి ఆకర్షించారు. ఈ కవితలోని వస్తువు బ్రిటిష్ పరిపాలనకు విరుద్ధంగా చెలరేగిన ఉద్యమంలో తుపాకి గుండ్లకు ఆహుతి అయిన పంద్రెండేళ్ళ బాలుడి కథ. ఈ లఘుకావ్యం ఒరిస్సాలోని నవతరానికి ప్రేరణాస్పందంగా మారింది. 1942లో హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ 'బాజీరాఉత్'తో సహా ఆయన కొన్ని ఇతర కవితల ఇంగ్లీషు అనువాదం వెలువరించడంతో రౌత్రాయ్ కీర్తి ఒరిస్సా బయట కూడా చాలా దూరం వ్యాపించింది.

రెండవ రచన 'పల్లీశ్రీ' (1942)లో ఒరిస్సా గ్రామ జీవితానికి సంబంధించిన విశిష్ట కవితలు ఉన్నాయి. దీనివల్ల, తదితర రచనల వల్ల రౌత్రాయ్ ఆధునిక ప్రగతిశీల ఒరియా సాహిత్యంలో అగ్రగణ్యుడైన కవిగా పేరు కెక్కారు.

1955లో 'Sachi Routrai : A Poet of the People' వెలువడింది. ఇందులో హుమాయూన్, కబీర్, కాళిదాస్, నాగ్, సచ్చిదానంద వాత్స్యాయన్, ఆర్.కె. శ్రీనివాస అయ్యంగార్ లాంటి సుప్రసిద్ధులైన రచయితల వ్యాసాలు ప్రచురింపబడ్డాయి. ఈ పుస్తకం రౌత్రాయ్‌కి దేశ వ్యాప్తంగా పాఠకులను సమకూర్చడమే కాక 'జనకవి' అనే విశేషణం ఆయన పేరుకు పర్యాయపదమయ్యింది.

ఒరియా కవితకు రౌత్రాయ్ చేకూర్చింది కొత్త కావ్య భాష, నుడికారం, ఆధునిక సంవేదన. సాహిత్యం గురించి, ముఖ్యంగా కవిత్వం గురించి తన కవితా సంపుటాల భూమికల రూపంలో ఆయన తన ఆలోచనలకు అభివ్యక్తి నిచ్చేవారు. వీటి ద్వారా కొత్త తరం కవులకు ప్రేరణ, మార్గదర్శకత్వం లభించేవి.

రౌత్రాయ్ తన కవితల రూపంలోనే కాక, విషయ వస్తువులో కూడా నిరంతరం మార్పు తెచ్చేవారు. తొలి కవితలలోని రొమాంటిక్ ప్రవృత్తి నుండి యథార్థవాదం, సమాజవాదం వైపు ముందుకు సాగారు. ఆ తర్వాతి రచనల్లో మార్క్సువాద ప్రభావం కనబడుతుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఆయన హిట్లర్, స్పెయిన్, బెర్లిన్ లాంటి చారిత్రక వ్యక్తుల, విషయాల పైన కూడా కవితలు రాశారు. ఆ తర్వాత చాలా కాలం వరకు కూడా 'కొరియా', 'ముజీబుర్ రహమాన్', 'యాహ్యాఖాన్' లాంటి కవితలు రాశారు. వీటివల్ల ఆయన రాజకీయ అవగాహన, సమకాలీన సంఘటనల పట్ల ఆయన ప్రతిక్రియలు మనకు స్పష్టంగా తెలుస్తాయి.

ప్రతి మనిషి స్వతంత్రుడుగా, సమానుడుగా ఉంటూ సంపూర్ణమైన గరిమతో, ఆశతో జీవించ గలిగే సమాజం స్థాపించబడాలనే పిలుపు నివ్వడానికే రౌత్రాయ్ తన కవితా శక్తిని వినియోగించారు. రైతులు, కూలీలు, చిన్న దుకాణదారులు, లాంటి సాధారణ ప్రజల గురించి కూడా ఆయన రాశారు. అయినా ఆయన తన కవిత్వాన్ని ఏదో నినాదంగా మారనివ్వలేదు. ప్రాథమికంగా ఆయన ఒక కవి కావడం వల్ల, తన కవితలో ఏదో తాత్కాలికమైన తేలిక స్థితికి అతీతంగా ఏవో గంభీరమైన భావాలను, మానవీయ ఆలోచనలను, ఉత్కృష్టమైన శిల్పంతోను, వ్యంజన ద్వారానూ వ్యక్తీకరించారు. కొత్త బింబాలను, రూపకాలను ఉపయోగించి విశిష్టమైన, తనదైన ఒక శైలిని వికసింప చేసుకున్నారు. ఒక కవితలో ఆయన ఇలా రాశారు:

*"నేను కూలీల కవిని*
*నా కలాన్ని ఆయుధం లాగా పట్టుకొని నిలబడ్డాను*
*ప్రజలు తమ ఆత్మ త్యాగాల నుండి లేచి*
*నిలబడే రోజు వస్తుందనే కలను కళ్ళలో నింపుకొని.*
*స్వాతంత్ర్యపు కొత్త ఎర్ర సూర్యుడు తూర్పునుండి ఉదయిస్తాడు.*
*నా కవి కలం మనుషులపై మనుషుల నమ్మిక పై*
*ఒక కొత్త అధ్యాయం రాస్తుంది."*

రౌత్రాయ్ తన గద్య రచనల ద్వారా కూడా పాఠకుల అభిమానం చూరగొన్నారు. ఆయన నవల, కథ, వ్యాసంతో సహా అనేక గద్య ప్రక్రియల్లో కూడా రాశారు. ఆయన రచించిన ఒకే ఒక నవల 'చిత్రగీత్' 1936లో ఆయన కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడు వెలువడింది. ఈ నవల ఆధునిక ఒరియా గద్య సాహిత్యానికి ఆయనని వైతాళికుడిని చేసింది. దీని ద్వారా ఒరియా సాహిత్యంలో మార్క్సు వాదం, మనోవిశ్లేషణాత్మక రచనలు ఆరంభమయాయి. ఇందులోని భాషా శైలిలో నేటికీ కొత్తదనం ఉందని విమర్శకుల అభిప్రాయం. నవలలోని హాస్య వ్యంగ్య సందర్భాలు రౌత్రాయ్‌ని ఒక శ్రేష్ఠ వ్యంగ్య రచయితగాకూడా ప్రతిష్ఠింప చేశాయి. 'చిత్రగీత్' ఆ యుగంలో వ్యాపించిన రొమాంటిక్ ప్రవృత్తి పైన, పలాయనవాదంపైన ఒక పెద్ద దాడి చేసింది.

రౌత్రాయ్ ఒరియా సాహిత్యంలో గొప్ప పరిశోధన కూడా చేశారు. ఒరియా సాహిత్య చరిత్ర రచనలో ఉంటూ వచ్చిన కొన్ని దోషపూరితమైన అభిప్రాయాలను, స్థాపనలను తొలగించడానికి ప్రయత్నించారు. భారతీయ సాహిత్యంలో విలువల, ఆదర్శాల వికాసానికి సంబంధించిన ఆయన పరిశోధనా గ్రంథం 1972లో వెలువడింది. ఇందులో వైదిక యుగం మొదలుకొని రాతియుగం (క్రీ.శ. 17వ శతాబ్ది) వరకటి కాలాన్ని గురించిన చర్చ ఉంది. దీని రెండవ భాగంలో క్రీ.శ. 17వ శతాబ్ది మొదలుకొని 19వ శతాబ్దం వరకటి కాలం చర్చనీయాంశమైంది.

1931, ప్రాంతంలో రౌత్రాయ్ ఒరియా సాహిత్యంలో అభ్యుదయ భావజాలానికి పునాది వేశారు. ఆ సంవత్సరమే 'దేవుడా నీ వెక్కడున్నావు?' అనే రచన వెలువడింది. 1931 నుండి 1935 మధ్యకాలంలో మార్క్సువాద, సమాజవాద ఆలోచనా ధోరణులను తన కవితల్లో, 'చిత్రగీత్' నవలలో మొదటి సారిగా ప్రవేశపెట్టిన గౌరవం రౌత్రాయ్‌కే దక్కింది.

రౌత్రాయ్ అభ్యుదయ రచయిత అయినా, అన్ని రాజకీయ పార్టీలకు దూరంగానే ఉన్నారు. అంతేకాక ఎన్నో కళల పైన, సాహిత్యంపైన అంకుశం ఉంచినందుకు లేక పహరా ఉంచినందుకు ఇనుప పరదాల దేశాల (Iron curtain countries) ను తీవ్రంగా ఖండించారు కూడా.

స్వాతంత్ర్య పోరాటం జరిగిన దినాల్లో ఒరిస్సా ప్రాంతంలో, దానికి వెలుపల కూడా ఆయన కవితలు ప్రజల్లో ప్రేరణను, ఉత్తేజాన్ని నింపాయి. ఒక ప్రముఖ అభ్యుదయ కవిగా రౌత్రాయ్ 1942లోనే గుర్తింపు పొందారు. అప్పుడు ఆయన వయసు 22 సంవత్సరాలు. తన వచన కవిత ద్వారా ఆయన ఒరియా సాహిత్యంలో నిజమైన ఆధునికతకు బీజారోపణ చేశారనేది కూడా నిర్వివాదాంశం. కాలం గడిచిన కొద్దీ, ఆయన 'కవులకు కవి'గా ఖ్యాతి పొందుతూ వచ్చారు. సామాన్య మానవుని సంఘర్షణ, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, వంటి వాటికి అభివ్యక్తి నిచ్చిన కవితల కారణంగా అంతకుముందే 'జనకవి'గా జన మానసంలో ప్రతిష్ఠింపబడి ఉండడం ఈ కొత్త బిరుదుకు అడ్డురాలేదు. ఒక 'జనకవి' నుండి 'కవులకు కవి' వరకు జరిగిన ఈ ప్రస్థానాన్ని చాలా సహజంగా సాగించి అరుదైన ఈ గౌరవం ఆయన పొందగలిగారు.

భారతీయ సాహిత్యానికి చేసిన విశిష్టమైన కృషికి వీరికి 1986వ సంవత్సర జ్ఞానపీఠ్ పురస్కారం ప్రదానం చేయబడింది. ఈయన అనేక కవితలు భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషులోకి అనువదించబడి ప్రాచుర్యం పొందాయి.

# భారతీయ కళకు నవోదయం - నందలాల్ బోస్

- కాంౖడేగుల నాగేశ్వరరావు

కాలంతో బాటుగా సాహిత్యం, కళాస్వరూపాలు మారుతూ వుంటాయి. సమాజం వస్తు వుత్పత్తి రీతుల ప్రభావం వలన నిర్మితం కావటంతో, కళలు, సాహిత్యం పై ఆ యుగధర్మ ప్రభావం ఉంటుంది. భారతదేశ చరిత్రలో పంతొమ్మిదవ శతాబ్దపు పూర్వార్ధ భాగాన్ని ఒక చీకటి కోణంగా చెప్పవచ్చు. మెకాలేతో ప్రారంభమైన ఆంగ్ల భాషాభివృద్ధి సిపాయిల కలహం తరువాత ఏర్పడ్డ బ్రిటీష్ రాజ్యాధిపత్యంతో ప్రజలలో ఆంగ్లేయుల వేష , భాషలపై మోజు ఏర్పడింది. ప్రాశ్చాత్యమైన ప్రతీదీ గొప్పదనే భావం ప్రజలలో నాటుకుపోయింది. దేశీయమైన వస్తువులు, కళలు నిరాదరణకు గురి కాబడ్డాయి.

అయితే భారతీయ చిత్రకళలో కనిపించే ప్రశాంత ఆధ్యాత్మిక భావాలవైపు ఆకర్షితుడయిన 'హావెల్' ప్రాశ్చాత్యుడే కావటం ఒక విశేషం. భారతీయ సంప్రదాయ చిత్రకళపై అత్యంత మక్కువ కలిగిన ఈ శ్వేత జాతీయుడు 1896 వ సంవత్సరంలో కలకత్తాలోని చిత్రకళాశాలకు ప్రిన్సిపల్‌గా నియమితుడైనాడు. దానితో హావెల్ బ్రిటీష్ ప్రభుత్వపు 'సిలబస్' ను భారతీయ కళకు అనుగుణంగా మార్చే ప్రయత్నం చేశాడు. హావెల్ అభిమానం ఎంతదూరం వెళ్ళిందంటే అతను అంతవరకూ కాలేజీలో వున్న యూరోపియన్ చిత్రాలను అమ్మివేసి వాటి స్థానంలో భారతీయ చిత్రాలను నింపాడు. అంతేకాదు భారతీయ చిత్రకళలో నిష్ణాతులైన వృత్తి కళాకారులను పిలిపించి వారిచేత విద్యార్థులకు పాఠాలు చెప్పించాడు. ఈ నేపథ్యంలో నందలాల్ బోసు చిత్రకళారంగ ప్రవేశం చేశాడు.

నందలాల్ 3.12.1882 వ సంవత్సరంలో బీహార్ లోని ఖరగ్‌పూర్‌లో జన్మించాడు. తండ్రి పూర్ణచంద్రబోస్ అక్కడి మహారాజా ధర్బాసింగ్ యొక్క ఆస్తివ్యవహారాలు చూసే అధికారి. 13 సంవత్సరాల వయస్సులో తల్లి మరణానంతరం నందలాల్ కుటుంబం ఖరగ్‌పూర్ విడచి కలకత్తా నగరం చేరుకుంది. బాల్యం నుంచీ వున్న చిత్రకళా అభిరుచిని అణచి వేసే ప్రయత్నం చేశాడు తండ్రి. కుటుంబ సభ్యులంతా కామర్స్‌కోర్సు తీసుకోమని, ప్రెసిడెన్సీ కాలేజీలో చదవమని ఒత్తిడి చేశారు. అప్పటికే కళాస్వాదన వంటబట్టింది. రాఫెల్, రవివర్మ చిత్రాలకు అనుసరణ చిత్రాలు గీశాడు. పెదనాన్న కుమారుడైన అతుల్‌మిత్రా చిత్రకారుడు కావటంతో అతను నందలాల్‌ను ప్రోత్సహించి, చిత్రకళలో ప్రాథమిక సూత్రాలను బోధించాడు. చివరకు నందలాల్ ధిక్కారంతో చేసేది లేక 1905 వ సంవత్సరంలో కలకత్తాలోని ఆర్ట్ స్కూలులో జేర్పించారు.

నందలాల్ కళాశాలలో ప్రవేశించే నాటికి హావెల్, చిత్రకళలో అప్పటికే పేరుగాంచిన అభీంద్రనాథ్ ఠాగూర్‌ను తన పంథాలోనికి తీసుకొని రావటమే కాక, అతన్ని ఆ కాలేజీకి వైస్ ప్రిన్సిపల్‌గా వుండమని ఒత్తిడిచేసి నియమించాడు. కాలేజీలో చేరిన కొత్తలో నందలాల్‌కు యూరోపియన్ చిత్రాలపై మక్కువ వుండేది. వాటికి నకళ్ళు వేసేవాడు, అయితే అభీంద్రనాథ్ ఠాగూర్ శిష్యరికంలో భారతీయ కళలోని అస్తిత్వాన్ని గ్రహించాడు. అభీంధ్రనాథ్ వేసిన బుద్ధుడు, సుజాత, వజ్రమూర్తి చిత్రాలు అతన్ని ఆకర్షించాయి.

---

కాంౖడేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

అభీంద్రనాథ్ చిత్రాలలో కనిపించే లలిత కోమలమైన సున్నిత రేఖాన్యాసం, అడుగడుగునా కనిపించే భారతీయత నందలాల్‌ను ఆకట్టుకుంది.

20వ శతాబ్దపు యుగారంభంలోనే భారతీయులు తమ అస్తిత్వ అన్వేషణను ప్రారంభించారు. లార్డ్ కర్జన్ బెంగాల్ విభజన ప్రజలలో జాతీయ భావాన్ని వృద్ధిచేసింది. అది స్వదేశీ అభిమానంగా దినదినాభివృద్ధి చెందింది. చదువుకొన్నవారి ఆలోచనా స్రవంతిలో ఒక కొత్తధోరణి వచ్చిపడింది. అసలు మనం ఎవరము? మన సంస్కృతి ప్రాభవం ఏమిటి? ప్రపంచంలో ఏ దేశానికి తీసి పోనటువంటి ప్రాచీన సంస్కృతిగల మనలో ఎందుకీ పరాధీనత? అంటూ తల్లివేరు అన్వేషణలో పడ్డారు. అప్పటికి 24 సం॥ వయస్సు గలిగిన నందలాల్‌ను ఈ సమాంతర భావాలు చుట్టుముట్టాయి. ఈ భావాలకు ఆధారభూతంగా నిలచిన అభీంద్రనాథ్ ఠాగూర్‌లో తన గురువును, ఆత్మీయుడను దర్శించాడు. అధ్యాపకులలో మేరు నగధీరులైన సురేంద్రనాథ్ గంగూలీ, క్షేమేంద్రనాథ్ మజుందార్, శైలేంద్రనాథ్ డీలా, సురేంద్రనాథ్ గుప్తాలు అతనిని అభిమానించి ఆశీర్వదించారు. అసిత్ కుమార్ హల్దార్, వెంకటప్పా, సమరేంద్రనాథ్ గుప్తాలు అతని సహాధ్యాయులు.

1906 వ సంవత్సరంలో హావెల్‌కు ఆరోగ్యం క్షీణించటంతో కాలేజీని అభీంద్రనాథ్ ఠాగూర్‌కు వదలి లండన్ వెళ్ళాడు. 1909 వ సంవత్సరంలో 'పెర్సీబ్రౌన్' అనే ఆంగ్లేయున్ని ప్రిన్సిపాల్‌గా నియమించారు. అతను తిరిగి బ్రిటీష్ సిలబస్‌ను కాలేజీకి తీసుకొని రావటంతో అభీంద్రుడు కాలేజీ నుంచి తప్పుకొని 'జోరాశాంకో' అనబడే తన ఇంటికి వెళ్ళిపోయాడు.

హావెల్ అభీంద్రనాథ్‌లు కృష్ణార్జునులులా భారతీయ ప్రాచీన సంప్రదాయశైలిని పునరుద్ధరించటం కోసం కంకణం కట్టుకున్నారు. ఆ చిత్రకళా ఔన్నత్యాన్ని చాటుతూ కలకత్తాలోని పాశ్చ, పాశ్చాత్య కళాకారుల నెందరినో కలిసారు. 1907 వ సంవత్సరంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరియంటల్ ఆర్ట్‌ను స్థాపించారు. అనేక పుస్తకాలు ప్రచురించారు, ఉపన్యాసాలు ఇప్పించారు. ఎన్నో ప్రాచీన కళాఖండాలను సేకరించారు. వాటిని విశ్లేషిస్తూ 'ప్రవాసి,' 'మోడరన్ రివ్యూల' ల పేర సంపుటలు ప్రచురించారు. అభీంద్రనాథ్ అతని అనునయులు, శిష్యులు వేసిన చిత్రాలను ప్రచురించారు. ఈ చిత్రాలన్నిటిలోనూ నందలాల్ వేసిన చిత్రాలే తలమానికలు. అప్పటికతను చిత్రకళాశాలలో ప్రవేశించి రెండు సంవత్సరాలే అయింది. అతను వేసిన ఒక చిత్రానికి 500 రూపాయలు నగదు బహుమతి లభించింది. ఆ డబ్బుతో దేశంలోని అన్ని కళాకేంద్రాలను దర్శించాడు. ఆనాడు అతను వేసిన 'సతి' అన్న చిత్రాన్ని జపాన్‌లో వున్న ఒక పుస్తక సంస్థ ప్రచురించింది. దానితో నందలాల్ పేరు ప్రపంచమంతా తెలిసింది (ఈ సంచిక ముఖ చిత్రం).

1909 వ సంవత్సరంలో లేడీ హారింగ్‌టనే అనే ఆమె కోరికపై అజంతా చిత్రాలకు నకళ్ళు వేసినపుడు, ఏదో తెలియని బంధం అతన్ని వివశుణ్ణి చేసింది, "బహుశ క్రిందటి జన్మలో ఇవి నేనే వేసి వుంటాను" అని చెప్పుకుని మురిసిపోయాడు. అజాంతాను దర్శించిన తరువాత అతని చిత్రకళ చాలా మార్పులకు గురయింది. ఆకారాది విషయంలో, సున్నిత భావప్రకటనలలో, రూప నిష్పత్తిలో అజంతా ప్రభావం

అతన్ని చివరివరకూ పట్టి ఉంచింది. దీనితో అప్రయత్నంగానే క్రమేపీ పాశ్చాత్య ధోరణి నుంచి దూరమవుతూ వచ్చాడు. అజంతా చూడకమునపు వేసిన చిత్రాలకు చూసిన తరువాత వేసిన వాటికి స్పష్టమైన తేడాలు మరీ ముఖ్యంగా వాష్‌పెయింటింగ్ టెంపెరాకు శైలిలో కనిపిస్తుంది.

నందలాల్ చదువు ముగిసిన వెంటనే అతన్ని అదే కాలేజీలో అధ్యాపకుడుగా కొనసాగమని కోరిన పెర్సీబ్రౌన్ అభ్యర్థనను త్రోసిపెట్టి అతి తక్కువ జీతానికి అభీంద్రనాథ్ కోరికపై ఆనంద కుమారస్వామి, సిస్టర్ నివేదితల కోసం భారతీయ ఇతిహాస ఘట్టాలను చిత్రించాడు. అభీంద్రనాథ్ సాన్నిహిత్యంలో, ఠాగూర్ ఇంటిలోనే గడిపాడు. అక్కడే ప్రఖ్యాత కళాకారులకు వేదికగా నిలచిన 'దక్షిణ వరండా' (southern varanda) లో ఎందరితోనో పరిచయాలు ఏర్పడ్డాయి. వారిలో ముఖ్యులు యూరోపియన్లయిన 'జాన్ ఉడ్‌రోఫ్', 'రొనాల్డ్‌షే' ప్రఖ్యాత జపనీయ చిత్రకారుడు 'ఒకురాకకూడో', భారతీయ సంస్కృతికి అద్దంపట్టిన వివేకానందుని తమ్ముడు మహేంద్రదత్త, వీరితో బాటు రామకృష్ణ మఠం నుంచి వచ్చి చేరిన ముఖ్యంగా మహరాజ్ బ్రహ్మచారిలాంటి అనేకమంది సాధుజనం. అప్పుడే రవీంద్రనాథ్ ఠాగూర్‌తో ఏర్పడ్డ పరిచయం, ఇవన్నీ ఒక జీవితకాలపు స్నేహాలుగా నిలిచాయి. పుంఖాను పుంఖాలుగా సాగిన ఈ పరిచయాలతో 'నందలాల్' ఒక మహోన్నత చిత్రకారునిగా ఎదిగాడు.

1914 వ సంవత్సరంలో విశ్వకవి రవీంద్రుని ఆహ్వానంపై శాంతినికేతన్‌లో చేరాడు. ఆ ప్రశాంత వాతావరణం, పద్మావతి నదిపై సాగే నిశ్శబ్ద పడవ ప్రయాణం, ఆకుపచ్చని పంటచేలు, పల్లె జీవితం అతని సౌందర్య దృష్టిని మరింత విస్తృత పరిచాయి. ఇవి అంతర్లీనంగా అతని ఇతిహాసా చిత్రాలకు కొత్త రూపాన్నిచ్చాయి. శాకోపశాఖలుగా విస్తరించిన మహావృక్షాలు శివుని కరాళ నృత్యాన్ని తలపింపజేస్తే, ఒక పల్లె స్త్రీలో శబరిని, విల్లంబులు బూనిన ఒక భిల్లు జాతి యువకునిలో 'అర్జుని' దర్శించి వారిని మన ముందుంచాడు. రవీంద్రుని గేయకావ్యం 'చయనిక'కు బొమ్మలువేసాడు. ఈ సమయంలోనే అతను వేసిన మరికొన్ని గొప్పచిత్రాలు. భీష్ముని శపధం, దృతరాష్ట్రుడు- గాంధారి, సావిత్రి, యముడు 1910లో పద్మిని, భీంసింగ్, ఏకలవ్య, అహల్యా శాపవిమోచనం.

విశ్వప్రేమను సదా స్పృశించే రవీంద్రుడు భారతీయ చిత్రకళాపరిధి మరింత పెంచదలచి జపాన్ దేశం నుంచి 'అరాయికెంపా' అనే ఒక జపాన్ చిత్రకారుణ్ణి విశ్వభారతికి రప్పించి అక్కడి విద్యార్థులకు జపనీయులు కుంచెనుపయోగించే ప్రత్యేక పద్ధతిపై శిక్షణను ఇప్పించాడు. నందలాల్ ఒక విద్యార్థిగా మారి ఆ సాంకేతిక ప్రజ్ఞను సొంతం చేసుకున్నాడు. దానినెంతో అనువుగా భారతీయ చిత్రకళలో మిళితం చేశాడు. ఇద్దరూ స్నేహితులుగా మారి పూరీ, కోణర్క్‌లను దర్శించారు. 1922 వ సంవత్సరంలో నందలాల్ శాంతినికేతనంలోని లలితకళావిభాగానికి ప్రిన్సిపాల్‌గా నియమితు డయినాడు. ఇక్కడ నుంచి నందలాల్ కళాసంపద శాకోపశాఖలుగా విస్తరించి మహావృక్షమైంది. కళల అంచుకు చేసిన అతని సుదీర్ఘ ప్రయాణంలో చెప్పదగిన ఎన్నో ముఖ్యమైన సంఘటనలలో కొన్ని :

1922లో అతన్ని కళాభవన్‌కు అధ్యక్షునిగా నియమింప బడటం. అప్పుడే 'తుఫానురాత్రి' చిత్రీకరణ. 1924 వసంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్‌కు తోడుగా బర్మా, మలయా, చైనా, జపాన్ దేశాలు

పర్యటించాడు. రవీంద్రుడు అతనిపై గౌరవంతో శాంతినికేతనలో ఒక భవనం నిర్మించి దానికి 'నందమన్' అని అతని పేరుపెట్టాడు.

1938 వ సంవత్సరంలో మహాత్మాగాంధీ కోరికపై ఆనాటి అఖిలభారత కాంగ్రెస్ సమాఖ్యకు 'కాళీఘరా శైలిలో ప్రజాజీవితాన్ని స్ఫురింప జేస్తూ సుమారు 400 చిత్రాలు వేశారు. అందులో వంద చిత్రాలు నందలాల్‌వే. మిగిలినవి నందలాల్ వేసిన చిన్నబొమ్మలను శిష్యులు పెద్దవిగా చిత్రించినవి, మొత్తానికవన్నీ నందలాల్ బాణీలోనివే. ఈ చిత్ర సముచ్ఛయాన్ని హరిపురా పోస్టర్స్ అంటారు. ఈ చిత్రంలో బెంగాల్‌లోని హరిపురా గ్రామ జీవితం ఆవిష్కరించబడింది. గాంధీ ఆ గద్దెపై ఉపన్యసిస్తూ 'నేను నందలాల్ అభిమాని'ని అని పేర్కొని అతన్ని ఎంతగానో ప్రశంసించాడు. 1939లో బరోడా మహారాజు ఆహ్వానంపై బరోడా వెళ్ళి అక్కడి 'కీర్తిమందిర్' లో 'గంగావతరణం' చిత్రించారు. అతని చిత్రాలలో చాలా ప్రాముఖ్యం వహించిన చిత్రాలలో అది ఒకటి.

నందలాల్ చిత్రకారుడే కాదు, ఒక చక్కటి వ్యాసకర్త కూడా. 1943లో పవిత్రానంద స్వామీజీతో, మాయావతీ అద్వియత ఆశ్రమములో జరిపిన దీర్ఘ సంభాషణ అనంతరం అతను వ్రాసిన 'కళ ఒక తపస్సు' అన్న వ్యాసం ఎంతో ప్రామాణికమైనది. 1944లో వ్రాసిన 'శిల్పకథ' అనే వ్యాసం, 1948లో 'శిల్పగురువు అభీంద్రనాథ్ ఠాగూర్' వ్యాసం ఎందరినో ఆకర్షించింది. అతను పొందిన సత్కారాలు లెఖ్ఖకు మించి వున్నాయి. 1950 వ సంవత్సరంలో బెనారస్ హిందూ యూనివర్శిటీ, ఆ తరువాత 1958లో కలకత్తా విశ్వవిద్యాలయం అతనికి గౌరవ డాక్టరేట్‌ని ఇచ్చి తమ్ముతాము సన్మానించుకున్నాయి. 1952 లో విశ్వభారతి తమ అత్యున్నత 'దేశికోత్తమ' బిరుదుతో సత్కరించింది. 1954 వ సంవత్సరంలో భారతదేశ ప్రభుత్వము అతన్ని పద్మవిభూషణ్‌గా గౌరవించింది. 1956లో ఆయన వ్రాసిన 'శిల్పచర్చ' అన్న వ్యాసాల సంపుటిని బెంగాలు భాషలో చిత్రకళపై ఒక ప్రామాణిక గ్రంథంగా భావిస్తారు.

1965 వ సంవత్సరంలో ఠాగూర్ శతజయంతి ఉత్సవంలో అతన్ని ఠాగూర్ ఉత్సవ అవార్డ్‌తో సత్కరించారు. అది స్వీకరించిన ఒక సంవత్సరానికి 16 ఏప్రిల్ 1966 వ సంవత్సరంలో నందలాల్ బోస్ కీర్తిశేషులైనారు.

మనరాష్ట్రంలో ప్రఖ్యాత చిత్రకారులైన కొండపల్లి శేషగిరిరావు, 'చిత్ర' (వీరభద్రరావు) వీరి ప్రత్యక్ష శిష్యులు. కొండపల్లికి శిష్యుడైన 'ఉల్చి' చిత్రాలలో నందలాల్ ప్రభావం, ముఖ్యంగా 'శబరి' వంటి చిత్రాలలో స్పష్టంగా కనిపిస్తుంది. నందలాల్ తన చిత్రాలలో నీటిరంగులు, కరక్కాయ సిరా, వాష్ అండ్ టెంపెరా పద్ధతులను ఉపయోగించేవారు. ఎక్కువ చిత్రాలు కాగితంపైనే వేయబడ్డాయి. కొన్ని సిల్కుగుడ్డపై, కొన్ని (చాలాతక్కువ) కుడ్యచిత్రాలు. భారతీయ చరిత్ర, సంప్రదాయాలను అణువణువునా నింపుకున్న నందలాల్ బోస్ శరీరం చిక్కి, శల్యమవుతున్నా తన అపారమైన కృషిని చివరి కంటా కొనసాగించారు.

చిత్రాలలో భారతీయ తత్వానికొక కాంతిపథ నిర్దేశకునిగా అతని స్థానం సుస్థిరమైనది! వేరెవరూ చేరుకోనటువంటిది. నవీన భారతీయ చిత్రకళలో అతను శిఖరంకాదు, శిఖరాగ్రం.

(ఈనెల 'మిసిమి' నాలుగు అట్టలపై చిత్రాలు నందలాల్ బోస్‌వే)

# అరణ్యారోదన

## (అడవుల పరిరక్షణ)

-సి.వి. సర్వేశ్వర శర్మ

ఒకప్పుడు ఈ భూభాగంలో 1/3 వ వంతు అటవీ సంపద ఉండేది. ప్రస్తుతానికి ఇది 1/5వ వంతుకి వచ్చింది. ఈ శతాబ్దాంతానికి 1/6 వ వంతుకు వస్తుందని భయపడుతున్నారు.

అడవులు కోల్పోవడంతో వర్షాభావ పరిస్థితులేర్పడి పంటలు పండకపోవడం, దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడడం, ప్రభుత్వానికి, ప్రజలకు సమస్యలు రావడం, దేశ ఆర్థిక స్తోమత కుంటుపడడం ఒక వరుసక్రమంలో జరుగుతున్న ప్రక్రియ.

కృత్రిమ అడవులు, సాంఘిక అడవులు ఏర్పరచడానికి ఎంతో కృషి చేస్తున్నారు. పనికిరాని భూములను అడవులుగా మార్చే పద్ధతిని ప్రవేశపెట్టారు. ప్రతి ఇంటికి ఒక చెట్టు, పుట్టిన ప్రతి ఒక్కరికి ఒక చెట్టు అత్యవసరం అని అన్పిస్తోంది. ప్రకృతి పరంగా అడవులు కాలిపోవడం జరుగుతోంది.

మన రాష్ట్రంలో ఉన్న అటవీ సంపద 23 శాతం కాస్తా 11 శాతానికి దిగజారింది. అడవుల క్షీణత మన జీవనాధారాలను దెబ్బతీస్తాయి. మన రాష్ట్రంలో చిట్టడవులు, ముళ్ళపొద అడవులు, ఆకురాలే అడవులు, సతత హరిత అరణ్యాలు కన్పిస్తాయి.

మన రాష్ట్రంలో ముఖ్య అటవీ వృక్ష సంపద సాల్, టేకు, మిశ్రమ అడవుల మీద ఉన్నాయి. గృహనిర్మాణం, పరిశ్రమలు, వ్యవసాయం కోసం అడవులను నరికివేయడం కారణంగా అడవుల విస్తీర్ణం తగ్గి ఎన్నో అరిష్టాలు ఎదురవుతున్నాయి.

పెరుగుతున్న జనాభాకి తరుగుతున్న వనరులు సమతౌల్య స్థితిని కలిగించ లేకపోతున్నాయి. మానవుడు సృష్టించిన కాలుష్యం అదుపు తప్పింది. అంతేకాదు. మానవ మేథ పరిధినుండి, చట్ట పరిధి నుండి దాటిపోయి మానవుని స్వలాభాపేక్షతో సంక్లిష్ట పరిస్థితిని, సంక్షోభాన్ని ఈ అదుపుతప్పిన పరిస్థితులు కల్పిస్తున్నాయి.

**మనిషి - సోమరి:** నిజానికి మనిషి కూడా తరగని ఒక సహజ సంపద. కాకపోతే తరగని శక్తి, యుక్తి కలిగిన మానవుడు సోమరితనానికి అలవాటు పడి విలాస జీవితానికి బానిసై ప్రకృతిని కాపాడడంలోను, తన దేశాన్ని శక్తివంతం చేసుకోవడంలోను ఆశించిన మేర కృతకృత్యుడు కాలేకపోతున్నాడు.

అందుకే మనిషికి ప్రకృతి శాస్త్ర విజ్ఞానాన్ని గుర్తుచేసి లేదా తెలియజేసి, ప్రకృతి వనరులను కాపాడటంలో బాధ్యత ఏమిటో చెప్పాలి. అడవులను రక్షించుకోవడమే వాటి పరిరక్షణ. వీటి గురించి క్షుణ్ణమైన పరిజ్ఞానం అవసరం. స్వార్థం, స్వలాభాపేక్షతో కూడిన మానవుడే అడవుల పాలిటి దానవుడయ్యాడు. తమను నరకవద్దని అరణ్యాలు రోదిస్తున్నాయి. వాటిని బాధించడం మానవుడు మానడంలేదు.

సృష్టిలో కాలుష్యమనే పదార్థము నిజానికి ఏదీలేదు. కాకపోతే మానవ నాగరికత విచిత్రమైన పరిణామంలో పడి క్రమరహితమై ప్రకృతిపద్ధతికి పూర్తిగా భిన్నంగా ఉండడం వల్ల ప్రకృతిలో కాలుష్యాలు రాను రాను పేరుకు పోతున్నాయి.

ఒక నిర్ణీత ప్రాంతంలో ఉండే అనేక రకాల జీవరాశుల సముదాయాలు, అక్కడ ఉండే నిర్జీవపరిసరాలు అంటే గాలి, నీరు, నేల మొదలయిన పరస్పరం ఒకదానితో ఒకటి కలసి నిర్వహించే క్రియల వ్యవస్థను ఆవరణ వ్యవస్థ అంటారు. ఇలాంటి ఆవరణ వ్యవస్థలు కొన్నికూడి ఉన్న భాగాన్ని అక్కడ వున్న జీవుల్ని కలిపి జీవావరణము అంటారు.

సి.వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, అమలాపురం.

అనేక జంతు, వృక్ష జీవరాశులతో కూడివున్న ఈ జీవావరణంలో మానవుడొక జీవరూపం మాత్రమే. తనచుట్టూ వున్న జంతువులకు, వృక్షాలకు ఇతర భౌతిక పరిసరాలకు ఎలాంటి హాని కల్గించినా అది మానవుని మనుగడకు కంటక ప్రాయమవుతుంది.

శాస్త్రీయవిజ్ఞాన ప్రగతితో మానవుడు సుఖజీవన లాలసుడై కృత్రిమ వాతావరణం సృష్టించుకుని తనంతటి జీవి ప్రపంచంలో మరొకటి లేదని గర్వంతో యథేచ్ఛగా మనుగడ సాగించడం కష్టమనే విషయం స్పష్టంగా తెలుస్తోంది.

మానవ జీవనం కొనసాగాలంటే జీవావరణ వ్యవస్థలో తన పరిమితిని, పాత్రను గుర్తించి జాగ్రత్త పడాలనే ఆలోచన వచ్చింది. అందుకే వృక్ష సంక్షేమం, జంతు సంరక్షణ, సమర్థమైన అటవీ నిర్వహణ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది.

**చెట్లు అందించే సేవలు:** నగరాలలో పార్కులు, ఉద్యానవనాలు, రోడ్డు ప్రక్కన చెట్లునాటడం వంటి పనులు చేపడుతున్నారు. వాతావరణంలో ఉండే వివిధ విషవాయువులను శుభ్రపరచడానికి, చల్లని గాలి ప్రసరింపచేయడానికి, నీడనిచ్చి స్వేదతీర్చడానికి, ధూళి, దుమారం ఇతర ఘన పదార్థాలను గాలి నుంచి తొలగించడానికి, ధ్వని, వెలుతురు తదితర వాయు ప్రకంపనాలను క్రమబద్ధీకరణ చేయడానికి చెట్లు తోడ్పడతాయి.

ఒకప్పుడు దక్షిణ భారతదేశం వెదురు మొక్క సంపదతో నిండి కాగితపు పరిశ్రమకు పట్టుగొమ్మగా ఉండేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. అరుణాచల్‌ప్రదేశ్ నుండి వెదురును కొనుగోలు చేసుకుంటున్నారు. హిమాలయాలు, నీలగిరి కొండలు, ఇతర పర్వత ప్రాంతాలలో పండ్లచెట్ల పెంపకం పేరిట ప్రకృతిసిద్ధమైన వృక్ష సంపదను పోగొట్టుకున్నాము.

కార్బన్ సైకిల్‌లో అడవులు ముఖ్యపాత్ర వహిస్తాయి. అడవులను నరికి వేయడం వల్ల ఎక్కువశాతం కార్బన్ వాతావరణం లోకి చేరుతుంది. ఫలితంగా వాతావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్ శాతం పెరుగుతోంది. ఇలాంటి మార్పులవల్ల హరిత భావన ప్రభావం చోటు చేసుకుని భూ వాతావరణం వేడెక్కుతోంది.

భూ వాతావరణం వేడెక్కడం వల్ల ఊహించని దుష్ఫలితాలు ఎదురుకావడమేగాక మంచు కరగడం, సముద్రమట్టాలు పెరగడం, అతివృష్టి, అనావృష్టి, జీవావరణానికి ముప్పు, వ్యవసాయంలో భంగపాటువంటి అనూహ్య పరిణామాలెన్నో ఏర్పడుతున్నాయి. ఈ పరిణామాలన్నింటికి ప్రధానకారణం అడవులను నరికివేయడం.

వర్షపాతానికి దోహదకారియైన అటవీ సంపదను సంరక్షించి అనావృష్టి నివారించాల్సి ఉంది. అరణ్యాలు లేని కొండల మీద పడ్డ వర్షపునీరు నేల ఉపరితలంలో ఉండే మట్టిని కొట్టుకుని తీసుకుపోతుంది. ఈ రకంగా కొన్ని సంవత్సరాలు జరిగితే నీటి కోతవల్ల నదులలోను, జలాశయాల్లోను ఒండ్రుమట్టి పేరుకుపోయి వరదల వంటి ప్రకృతి బీభత్సాలు మొదలవుతాయి.

వర్షపునీటి కోతవల్ల, వరదలవల్ల ఇప్పటికే సాలీనా కొన్ని కోట్ల టన్నుల సారవంతమైన మట్టి ఏటి పాలవుతోంది. ఈ సమస్య ప్రభావం మనిషి ఆర్థిక పరిస్థితి మీద, జీవావరణం మీద అధికంగా ఉంటుంది.

**అడవులు నాశనం అయితే?:** అడవులు నాశనం కావడం వల్ల వాతావరణం కాలుష్యమవుతోంది. భూమిపై పచ్చని చెట్లు ఎక్కువగా ఉంటే కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్ ఎక్కువగా తయారవుతుంది. ప్రకృతిలోని జీవజాలానికి కావలసినంత ఆక్సిజన్ లభించడమేగాక అధికంగా ఉన్న

ఆక్సిజన్ 'ఓజోన్' గా మార్పు చెంది భూమండలం పైభాగంలోని ఓజోన్ పొరలో జేరుతుంది. ఈ పొర సూర్యుని నుండి వస్తున్న అతి నీలలోహిత కిరణాలను అడ్డుకొంటుంది. అడవులు నాశనం అయిపోతూ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఓజోన్ పొర పలుచబడి భూమిమీద శీతోష్ణ స్థితిలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి.

అడవులు ఉన్న ప్రాంతంలోని శీతోష్ణస్థితి క్రమబద్ధం అవుతుంది. వృక్షాల వల్ల బాష్పోత్సేకము ఎక్కువగా జరిగి గాలిలో తేమ శాతము పెరిగి వాతావరణము క్రమ బద్ధం కాబడుతుంది. అడవుల వల్ల వర్షపాతము, నీటి ప్రవాహవేగము అదుపులో ఉంటాయి.

అటవీ ప్రాంతంలో పడిన వర్షపు చినుకులు ఆకులపై నుండి నెమ్మదిగా చెట్టు శాఖలు, కాండాల ద్వారా భూమిపై పడతాయి. భూమిపై పడ్డనీరు చిన్న చిన్న పొదలు, గడ్డి మొదలగు వాటి ద్వారా ప్రవహించడం వలన నీటి ప్రవాహవేగం తగ్గుతుంది. భూమికోతకు గురికాదు. భూమికోత వర్షం వల్లనే కాకుండా గాలి ద్వారా కూడా ఏర్పడుతుంది. అడవులులేని ప్రాంతంలో గాలికి అడ్డూ అదుపు ఉండదు. గాలి విపరీతమైన వేగంతో వీస్తుంది. దానితో గాలివలన కూడా భూమికోతకు గురి అవుతుంది. చివరకు సారవంతమైన భూభాగము కొట్టుకుపోయి నిస్సారమైన భూమి ఉంటుంది. ఎడారిగా మారి ఉత్పాదక శక్తిని ఆ నేల కోల్పోతుంది.

అడవులున్న ప్రాంతంలో నేలలో వృక్షాల వేర్లు వ్యాపించి ఉండడంవల్ల వరదలు వచ్చినపుడు అవి తీవ్రతరం కాకుండా నిరోధించగల్గుతాయి.

అడవులపై ఆధారపడి బ్రతుకుతున్న అనేకమంది ఉపాధి కోల్పోతున్నారు. పూర్వం అడవులలో అనేక రకములైన పండ్లు, ఆహారానికి ఉపయోగపడే జంతువులు దొరికేవి. అంతవరకూ ఎందుకు ఒకప్పుడు గూడ బాతు అంటే పెలికాన్ పక్షులకు మన రాష్ట్రంలోని కొల్లేరు ప్రాంతం ఒక స్థావరం. కొల్లేరు ప్రాంతంలోని వృక్ష సంపద నాశనం కావడంతో పెలికాన్ పక్షులు గూళ్లు కట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో ఆ ప్రాంతం నుండి ఈ పక్షులు వలస వెళ్ళిపోయాయి.

**తగ్గిన రాజహంసలు:** పులికాట్ సరస్సు తీరంలోని మడచెట్లు అడవులు తగ్గడం వల్ల అక్కడికి వలసవచ్చే రాజహంసల సంఖ్య తగ్గిపోయింది. విరివిగా లభించే ఔషధ మొక్కల కోసం, సుగంధ ద్రవ్యాలనిచ్చే మొక్కల కోసం, ఏనుగు దంతాలకై ఇతర ఆర్థిక పరమైన మొక్కలకై అటవీ సంపదను నాశనం చేస్తున్నారు.

అడవులు నరికివేయడం వల్ల 35 వందల వృక్షజాతులు, రెండు వేల రకాల పక్షులు, అయిదువందల రకాల జంతువులమీద ఈ చర్య ప్రభావం ఉందని ఒక సర్వేలో వెల్లడయింది.

సామాజిక అడవుల పెంపకంలో వాణిజ్య దృష్టితో ఒకే జాతికి చెందిన మొక్కలు పెంచకుండా సామాజిక అవసరాల కోసం వివిధజాతులకు చెందిన ఉపయోగకరమైన మొక్కలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అడవుల పెంపకం ప్రస్తుతం ఉన్న అడవులలోనేగాక బీడు ప్రాంతాలలో, కొండప్రాంతాలలో చెట్ల పెంపకాలను ప్రోత్సహించాలి. ఈ అడవుల పెంపకంలో ప్రజలు భాగస్వాములుకావాలి. వనమహోత్సవ దినోత్సవసమయంలోనే గాక వివాహాది శుభకార్యాల సందర్భంలో, జాతీయ దినోత్సవ సందర్భంలో ఇంకా దేశనాయకులు, ప్రముఖుల జయంతి, వర్ధంతి సందర్భాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడము ఆపైన వాటిని రక్షించుకునే విధానాలను చేపట్టడం అలవరచుకుంటే దేశ సౌభాగ్యము బాగుండడమే కాదు మానవ జీవితం, ఇతర జీవరాశుల మనుగడ సుఖమయం అవుతుంది.

# ఆనంద కుమారస్వామి - భారత దేశంతో అనుబంధం

- డా॥ కడియాల రామమోహనరాయ్



ఆనందకుమారస్వామి

భారతీయ చిత్రశిల్ప కళా వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఆనంద కె. కుమారస్వామి. కళావిమర్శకునిగా ఆయన తెల్పిన విషయాలను కళోపాసకులు ఇప్పటికీ శిరోధార్యంగా గ్రహిస్తున్నారు. శాస్త్రవేత్తగా ప్రారంభమైన ఆయన జీవితం కళావిమర్శకునిగా చిత్రకారునిగా మలుపుతిరిగింది. పరిశీలించిన కొద్దీ అనేక ఆసక్తికరమైన అంశాలను ఆయన గ్రంథాలు వెల్లడిస్తాయి.

ఆనందకుమారస్వామి సింహళ దేశంలో కొలంబోలో క్రీ.శ. 1877 ఆగస్టు 22వ తేదీన జన్మించారు. తండ్రి సర్ ముత్తు కుమారస్వామి, తల్లి ఎలిజబెత్ క్లే బీబి (బ్రిటిషు వనిత). వారి పేరులోవున్న కుమారస్వామి హిందూదేవత స్కందకుమారస్వామి పేరే. సర్ ముత్తు బ్రిటన్‌లో కొన్నాళ్ళు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఆనందకు రెండేళ్ళు నిండకముందే ముత్తు మరణించారు. ఎలిజబెత్ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. బ్రిటన్‌లో వుండి ఆనందను పెంచి పెద్దవాణ్ణి చేసింది.

కుమారస్వామి భూగర్భశాస్త్రంలో బి.యస్సీ, ఫస్ట్‌క్లాస్ ఆనర్స్‌తో పాసయ్యారు (1897). లండన్ యూనివర్సిటీ నుండి ఫెలో ఆఫ్ యూనివర్సిటిగా గుర్తింపుపొందారు (1903). ఇదే యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు (1906). ఈ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందిన మొదటి సింహళీయుడీయనే.

కుమారస్వామి ఈథెల్‌మేరీ అనే బ్రిటీష్ యువతిని పెళ్ళి చేసుకొని సింహళం తిరిగి వచ్చారు.

ఈథెల్ మంచి ఫోటోగ్రాఫర్. ఎంబ్రాయిడరీ చెయ్యటంలో నేర్పరి. కుమారస్వామి రచించిన 'Mediaeval Sinhalase Art" లో ఫోటోలు ఈమె తీసినవే.

కుమారస్వామి సంఘసంస్కర్త - సింహళ సంఘసంస్కరణ సమాజానికి ఆయన కొన్నాళ్ళు అధ్యక్షుడు, దేశీయమైన ఉత్పత్తులను ఉపయోగించాలని, యంత్రాలతో తయారైన వస్తువులను ఉపయోగించరాదని, దేశీయమైన కట్టడాలను, కళలను భద్రపరచు కోవాలని సంఘసంస్కరణ సమాజం ప్రచారం చేసింది.

సిలోన్ Mineralogical Survey కు కుమారస్వామి డైరక్టర్‌గా నియమితులై, ఆ రంగంలో విశేషమైన కృషి చేసి, Administrative Report తయారు చేసి ప్రశంసలందుకొన్నారు. కొద్దికాలంలోనే ఆయన భూగర్భం శాస్త్రం నుండి తమ అభిరుచిని కళారంగానికి మళ్ళించు కొన్నారు.

వారసత్వంగా సంక్రమించిన ఆస్తివల్ల ఆయనకు ఆర్థిక ఇబ్బందులేమీ కలగలేదు. భారతదేశంలో కొంతకాలం పర్యటించి, బ్రిటన్ చేరుకొని లండన్‌లో ఒక ఇల్లు కొనుక్కొని స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు.

1910లో భారతీయ చిత్రకళా చరిత్రలో ఒక దుమారం లేచింది. సర్ జార్జి బర్ట్‌వుడ్ భారతదేశంలో లలితకళ ఏదీ లేదన్నారు. ఆ అభిప్రాయం పొరపాటని రోజర్‌ఫ్రై ప్రాగ్దేశకళను ప్రశంసిస్తూ లండన్ 'టైమ్స్' పత్రికకొక లేఖ రాశారు. ఇదే సంవత్సరం కుమారస్వామి లండన్‌లో India Society ని స్థాపించారు. భారతీయ కళలను సంస్కృతిని అధ్యయనం చేసి, వాటి గొప్పతనాన్ని ప్రచురణల ద్వారా తెలియ జెప్పటం ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకొన్నది.

---

డా॥ కడియాల రామమోహనరాయ్, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు, ఎస్.వి.యన్. కాలని, గుంటూరు.

కళావిమర్శలో జాన్‌రస్కిన్ 'Modern Painters' ఒక మైలురాయి. ప్రకృతి చిత్రణ అంటే రస్కిన్‌కి మక్కువ. భారతీయ కళ అవాస్తవమైనదని ఆయన తలచారు. 'Rajput Miniatires' ను రస్కిన్ చూడలేదు. వీటిలో పూలు, లతలు, పక్షులు, చెట్లు, లేళ్ళు, నెమళ్ళు మొదలైనవి కనువిందుచేస్తాయి. భారతీయ శిల్పాలలో అందమైన వన్యమృగాలను, జంతురూపంలో వున్న దేవతలను ఫోటోలు తీసి వాటిని కుమారస్వామి 'విశ్వకర్మ' పత్రికలో 1912 - 1914 సంవత్సరాలలో ప్రచురించి రస్కిన్ అభిప్రాయం పొరపాటని రుజువు చేశారు.

విన్సెంట్‌స్మిత్ 'Early History of India' లో గాంధార శిల్పరీతిని వివరిస్తూ మూడు నాలుగు శతాబ్దాలకు చెందిన రోమన్ ఆర్ట్‌కు ఇది 'సెకండ్‌రేట్ ఇమిటేషన్' అన్నారు.

భారతీయ కళ విశిష్టతను మొదట సరిగా గుర్తించినవాడు ఇ.బి.హావెల్. మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌కు సూపరిండెంట్‌గా, కలకత్తా స్కూల్ ఆఫ్ ఆర్ట్ ప్రిన్స్‌పాల్‌గా ఆయన భారతీయ కళకు చేసిన సేవ గొప్పది. ఈయన అవనీంద్రనాథఠాకూర్ (రవీంద్రుని మేనల్లుడు) ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. తర్వాత అవనీంద్ర కలకత్తా స్కూల్ ఆఫ్ ఆర్ట్ వైస్ ప్రిన్స్‌పాల్‌గా నందలాల్ బోస్, సురేంద్ర నాథ్‌గంగూలీలను చిత్రకారులుగా తీర్చిదిద్దారు.

1907లో భారతదేశం వచ్చిన ఆనందకుమారస్వామి రవీంద్రనాథఠాకూర్, హావెల్‌లకు మంచి మిత్రులయ్యారు. కుమారస్వామి 'Indian Painting and Sculpture' ప్రచురించారు.

విన్సెంట్ స్మిత్ 'History of Fine Art in India and Ceylon' (1911) లో కుమారస్వామి, హావెల్‌లు భారతీయ కళను గూర్చి తెల్పిన అంశాలు అతిశయోక్తులని ఆక్షేపించారు. కాని ఒకప్పుడు గాంధార శిల్పాన్ని మరీ తక్కువ చేసి మాట్లాడిన స్మిత్ అభిప్రాయంలో కుమారస్వామి హావెల్‌ల రచనలవల్ల కొంతమార్పు వచ్చింది.

1909-1913 మధ్య కాలాన్ని కుమారస్వామి భారతదేశం నుండి ఇంగ్లాండ్ వెళ్తూవస్తూ గడిపారు. ఈ మధ్యకాలంలో భార్య ఈథెల్‌తో విడిపోయారు.

కుమారస్వామి ఠాకూర్ల నివాసగృహం 'జొరాశంకొ'లో రవీంద్రుని కలుసుకున్నారు. ఆ ఇంట్లో చిత్తరువులను, సంగీత వాద్యాలను, కంచు విగ్రహాలను చూచి ముగ్ధులయ్యారు. ఠాకూర్ల దుస్తులు-ధోవతి చద్దార్‌లు ఆయనకు అపరిమితంగా నచ్చాయి.

ఇండియా రాజధానిని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చినప్పుడు ఢిల్లీ నిర్మాణంలో బ్రిటీష్ ఇంజనీర్ల ఆలోచనలు సరికావని కుమారస్వామి, హావెల్ హెచ్చరించారు. పాశ్చాత్యపద్ధతిలో గాక భారతీయ నిర్మాణరీతులను అనుసరించి ఇక్కడి పనివాళ్ళనే ఉపయోగించు కోవలసిందిగా కోరారు. దీనివల్ల దేశీ ప్రజల ఆదరం లభిస్తుందని, ఖర్చు కలిసివస్తుందని తెలిపారు.

ఇండియాకు ఒక నేషనల్ మ్యూజియమ్ అవసరాన్ని కుమారస్వామి గుర్తించారు. తాను సేకరించినవి, ఇతరులవి కలిపి ప్రభుత్వం ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేసి, దానికి తనను డైరెక్టర్‌ని చేస్తే శాశ్వతంగా ఇండియాలో ఉండిపోవాలనుకున్నారు.

1916లో కుమారస్వామి Rajput Painting ప్రచురణ భారతీయ కళారంగంలో ఒక పెద్ద మార్పుకి కారణమైంది. అదే సంవత్సరం ఆయన రచించిన 'Buddhism and The Gospel of Buddhism' ఉత్తమ గ్రంథంగా ప్రశంసలనందుకొన్నది.

కుమారస్వామి మరొకసారి పెళ్ళిచేసుకున్నారు. ఈమెపేరు ఆలిస్ రిచర్డ్సన్. తర్వాత ఈమె తన పేరు రతన్‌దేవిగా మార్చుకున్నది. వీరికి జన్మించిన అబ్బాయికి 'నారద' అనిపేరు పెట్టుకున్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి 'Thirty Songs from Panjab and Kashmir' అనే పుస్తకం ప్రచురించారు. దీన్ని నారదకు అంకితమిచ్చారు.

బెనారెస్‌లో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేయాలని కుమారస్వామి ప్రయత్నించారు. దానికి తాను సేకరించిన అమూల్య కళాఖండాలన్నిటిని ఇచ్చివేయాలని కూడ ఆయన తలచారు. కాని ఆ మ్యూజియమ్ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపలేదు. దాంతో భారతీయులు ఆ కళాఖండాలను కోల్పోయారు. బెనారెస్ యూనివర్సిటీలో ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్‌కి ప్రొఫెసర్‌గా వుండాలని కూడ ఆయన అభిలషించారు. ఆ కోరిక కూడ నెరవేరలేదు.

బోస్టన్ మ్యూజియమ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (USA) వారు కుమారస్వామి సేకరించిన కళా ఖండాలను వెలయిచ్చి కొనటమేగాక మ్యూజియమ్‌లో భారతీయ విభాగానికి క్యూరేటర్ పదవి ఇచ్చి గౌరవించారు.

History of Indian and Indonesian Art' (1927) గ్రంథాన్ని ఆయన అమెరికాలో వున్నప్పుడు రచించారు.

రతన్‌దేవి కుమారస్వామిల దాంపత్య జీవితం ఎక్కువ కాలం కొనసాగలేదు. వారికి రోహిణి అనే మరొక అమ్మాయి పుట్టిన తర్వాత విడిపోయారు.

తనకంటె వయసులో చాల చిన్నదైన (అప్పుడా అమ్మాయి వయసు 17 ఏళ్ళే) స్టెల్లా బ్లాక్‌తో కుమారస్వామి ప్రేమలో పడ్డారు. తన వాళ్ళందరూ వద్దని చెప్పినా పెడచెవిని పెట్టి స్టెల్లా ఆయనను పెళ్ళిచేసుకొన్నది. కుమారస్వామి బోస్టన్‌లో వుండేవారు. స్టెల్లా న్యూయార్క్‌లో వుండి డాన్స్, పెయింటింగ్ నేర్చుకొన్నది. కుమారస్వామి ఈ దశలో ఫొటోగ్రఫిపై అభిరుచిని పెంపొందించుకున్నారు. స్టెల్లాను ప్రకృతి దృశ్యాలను వందలకొద్ది ఫొటోలు తీసి ప్రదర్శనకు పెట్టారు ; కొన్నిటిని ఫొటోగ్రఫి జర్నల్స్‌లో ప్రచురించారు.

స్టెల్లాతో కలిసి కుమారస్వామి ఇండియా మరికొన్ని తూర్పుదేశాలు పర్యటించారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్యతో కలిసి కుమారస్వామి రచించిన 'The Mirror of Gesture (అభినయ దర్పణం అనే సంస్కృత గ్రంథానువాదం) ను హార్వర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించింది.

The Sunwise Turn Book Shop కుమారస్వామి వ్యాస సంకలనం 'The Dance of Shiva' ప్రచురించింది. ఆయన పేరు తలచుకోగానే చాలమంది కళాభిమానులకు ముందుగా జ్ఞాపకం వచ్చేది యిదే. భారతీయ కళలోని పెక్కు సూక్ష్మాంశాలను ఇందులో వ్యాసాలు చక్కగా వివరించాయి.

కుమారస్వామి చిత్రించిన 'Twenty Eight Drawings' ను కూడ Sunwise వారే ప్రచురించారు.

కళావిమర్శకుడిగా ప్రపంచఖ్యాతిగాంచిన కుమారస్వామికి ఆధునిక చిత్రకళ, శిల్పకళల మీద ఏమాత్రం సదభిప్రాయం లేదు. "The very term modern art is an absurolity, The notion that one should attempt to be original in art is sheer nonsense" అని ఒక సందర్భంలో ఆయన ఆధునిక కళను నిరసించారు. పికాసో వంటి విశ్వవిఖ్యాత చిత్రకారులెవరూ ఆయన కంటికి ఆనకపోవటం ఆశ్చర్యంగా తోస్తుంది.

1930లో కుమారస్వామి స్టెల్లాతో విడిపోయారు. అదే సంవత్సరం ఆయన తనకంటే వయసులో చాల చిన్నదైన, ఇరవై ఐదేళ్ళ డోనా లూసారన్ ను పెళ్ళిచేసుకున్నారు. నాలుగవ భార్య డోనా వల్ల ఆయనకొక కుమారుడు కలిగాడు. అతనికి 'రామ' అని పేరు పెట్టుకున్నారు. డోనాతో ఆయన దాంపత్య జీవితం ఆనందంగా గడిచింది.

కుమారస్వామి రచించిన 'A New Approach to the Vedas', 'Yaksas' గ్రంథాలు కూడ విజ్ఞుల ప్రశంసలను అందుకొన్నవి. ఇంకా ఆయన రచనలు 'The Transformation of Nature in Art' ; 'Elements of Buddhist Iconography' కళావిమర్శలో ప్రామాణిక గ్రంథాలుగా గుర్తింపుపొందాయి. ప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు I.A. రిచర్డ్స్ కుమారస్వామికి ప్రియమిత్రులు.

1945 లో భారతదేశం నుండి ఒక యువకుడు కె. భరత అయ్యర్ ఆనందకుమార స్వామి 70వ జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకొని ఒక అభినందన గ్రంథాన్ని ప్రచురించదలచామని అందుకు సహకరించవలసిందిగా కోరుతూ ఆయనకొక లేఖరాశాడు. అందుకు తన సమ్మతిని తెలియజేస్తూ కుమారస్వామి వివిధరంగాలకు చెందిన కొందరు రచయితల పేర్లను కొన్ని సూచనలను అందజేశారు.

Art and Thought పేరుతో ఆ అభినందన గ్రంథం 40 వ్యాసాలతో కుమారస్వామి బహుముఖప్రజ్ఞను వెల్లడించేవిధంగా తయారైంది.

ఇదే సమయంలో మలయాలోవున్న ఎస్. దురైరాజసింగమ్ ఆనందకుమారస్వామితో జ్ఞాపకాలను నివాళులతో కూడిన మరొక గ్రంథాన్ని సంకలనం చేశారు.

*చివరికోరిక:* 70వ జన్మదినోత్సవం తర్వాత ఆనందకుమారస్వామి తన శేష జీవితాన్ని భారతదేశంలో గడపాలని సంకల్పించారు. భారతీయుల వానప్రస్థాశ్రమ స్వీకారం ఆయనకు మిక్కిలి నచ్చింది. కుటుంబంతో సహా ఆ తర్వాతి సంవత్సరం భారతదేశం రావాలను కొన్నారు. హిమాలయపర్వత సానువులలో ప్రశాంతమైన ప్రదేశంలో ఒక యిల్లు చూడమని మిత్రులొకరికి లేఖరాశారు.

కుమారస్వామి గౌరవార్థం బోస్టన్‌లో ఆయన అభిమానులు ఒక విందు ఇచ్చారు. జీవితంలో చివరిదశను ఆయన ఎలాగడపదలచుకొన్నదీ విందు తర్వాత చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. చివరి దశను ఆయన Astam gamana-going home' అన్నారు "we mean to remain in India, now a free country for the rest of life. (1947 అని ఉద్దేశ్యాన్ని స్పష్టంగా తెలిపారు. ఈ ప్రసంగంలో ఆయన తనను art historian గా, ఆధ్యాత్మికవేత్తగా, సామాజిక తత్వవేత్తగా తెలుపుకున్నారు. ఆ ప్రసంగం పూర్తి అయిన కొద్ది సేపటికే ఆయన అస్వస్థులయ్యారు. ఆయన భార్య ఆయనను వెంటనే ఇంటికి తీసుకువెళ్ళారు. తర్వాత కొద్ది వారాలు ప్రశాంతంగా గడిచాయి.

1947 సెప్టెంబర్ 9వ తేదీన కుమారస్వామి 'The Dance of Shiva' కొత్త ఎడిషన్ కోసం దాని రివిజన్ పని చూస్తుండగా ఆయన భార్య మేడమీద నుండి కిందికి రమ్మని పిలిచింది. కిందికి వచ్చిన కొద్దిసేపటికి తనకు ఊపిరాడటం లేదని సైగలతో తెలిపారు, ఎల్లప్పుడూ ఆయన జేబులో సిద్ధంగా ఉండే మాత్రను ఆమె వెతికి తీసింది. అంతలోనే స్పృహ కోల్పోయిన ఆయన అంబులెన్స్, డాక్టరూ వచ్చే లోగానే ప్రాణం విడిచారు.

శ్రీమతి డోనా ఆనందకుమారస్వామి అస్థికలను, చితాభస్మాన్ని భారతదేశం తీసుకువచ్చి గంగానదిలో నిమజ్జనం చేశారు.

భారతీయ సంస్కృతిని, కళను ఆత్మీయంగా తలచిన ఆనందకుమారస్వామి చిరస్మరణీయుడు.

# తెలుగు భాషా ప్రాచీనత - చర్చ

- కె. పద్మావతి

15వ శతాబ్దికి చెందిన నికోలోదకోంటి అనే పాశ్చాత్య విద్వాంసుడు తెలుగును 'ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్' అని ప్రశంసిస్తే; 1878వ సం॥లో గోదావరి జిల్లా చరిత్రను, 1890లో తెలుగు వ్యాకరణాన్ని వ్రాసిన హెచ్. మారిస్ తెలుగులాంటి సుగ్రాహ్యమైన భాష మరొకటి లేదన్నాడు. ద్రావిడభాషల్లో ఇది తియ్యనిదీ (సంగీతాత్మకమైనది) చదువుంచివారి పెదాలమీద కూడ ఈ భాష మధురంగా వినిపిస్తుంది. ఈ భాషని ఇటాలియన్ ఆఫ్‌ది ఈస్ట్ అన్నారంటే అది సబబే అనికూడ అన్నారు. యూరోపియన్ భాషల్లో ఇటాలియన్ ఎలా అజంతమైందో, తూర్పు అంటే భారతీయ భాషల్లో తెలుగు అలా అజంత భాష అనే భావంతో, దీన్ని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్నప్పటికీ ఆ అజంతతవల్ల లభించే నాదమధురమైన సంగీతగుణం వల్ల దీని మాధుర్యానికి ఆ కీర్తి వచ్చిందన్నా అది సబబే అవుతుంది.

క్రీ.శ. ఐదో శతాబ్దినాటికే అమరావతి స్థూపశిథిలాలో మొదటి లిఖిత తెలుగు పదరూపం 'నాగబు' లభించిందని సుప్రసిద్ధ పరిశోధకులు వేటూరి వారు నిరూపించారు. అయితే భాషా - జాతి ప్రాచీనత వేరు. ఐతరేయ బ్రాహ్మణంలోను ఆంధ్రుల ప్రస్తావన కనబడుతుంది. మహాభారతంలో ఆంధ్రుల ప్రశంస గమనించవచ్చు.

హాలుని గాథాసప్తశతి, గుణాఢ్యుని బృహత్కథలో తెలుగు శబ్దాలున్నట్లు సాహితీ చరిత్ర చెప్తోంది.

క్రీ.శ. 575లో కడపజిల్లా ఎర్రగుడిపాడులో రేనాటిచోళరాజులు వేయించిన మొదటి తెలుగు వచన శాసనం దొరికింది. క్రీ.శ. 848లో అద్దంకిలో వేయించిన శాసనం తొలి తెలుగు పద్యశాసనంగా గుర్తింపు పొందింది.

నన్నయకు పూర్వమే తెలుగు భాషకు ఇంత చరిత్ర ఉన్నట్లు తెలుస్తున్నా ప్రాచీనభాషగా తెలుగునకు గుర్తింపు సాధించడంలో వెనుకంజ ఎందుకువేయాలి.

శాతవాహనుల కాలంనాటి సంస్కృత ప్రాకృత శాసనాలలో కనిపించే ఊళ్ళ పేర్లలోని 'ఖడవలి (కొడవలి) వంటి పదాలు ఆంధ్రభాషా ప్రాచీనతను నిరూపించటానికి ఉదాహరించు కోవచ్చుననునది పెద్దలమాట.

తెలుగు భాష మూల ద్రావిడ భాష నుండి 3000 ఏళ్ళనాడే విడిపోయిందని భాషా శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. 3000 ఏళ్ళనాడు తెలుగు భాష సంస్కృతి ఎలా ఉండేదో ఊహిస్తు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి శాస్త్రబద్ధమైన వ్యాసం వ్రాశారు.[1] నాటి తెలుగు వారిని గురించిన ఆలోచనలు ఎక్కువగా ఊహలే. అయితే రెండువేల ఏళ్ళనాడు వారెంత వికాసం చెందారో చెప్పడానికి కొన్ని ఆధారాలున్నాయి అంటున్నారు ఆచార్య ఆర్వీయస్ సుందరం.[2] గ్రీసుదేశం నుండి వచ్చి మెగస్తనీసు మౌర్యుల తరువాత గొప్ప సైన్యం, కోటలున్న రాజులు ఆంధ్రులే అని రాశారు. హాలుని గాథాసప్తశతిలో ప్రాకృత పదాలు, తెలుగు పదాలు కన్పిస్తాయి. 'గాథాసప్తశతి' ప్రాకృతభాషలో ఉన్నా 2 వేల సం॥నాటి తెలుగువారి జీవితంలో చోటుచేసుకొన్న అనేక విషయాలను సూచిస్తోంది. తెలుగు భాష నుండి ఎన్నో

కె. పద్మావతి, తెలుగు లెక్చరర్, పి.బి.ఎస్. కాలేజి, నిడుబ్రోలు.

పదాలను సాంస్కృతిక విషయాలను స్వీకరించిన ఈ పుస్తకం ఆనాటి తెలుగు అభ్యున్నతిని సూచిస్తోంది అంటారు ఆచార్య సుందరరంగారు.

శాతవాహన రాజులలో నలుగురికి పేరుగా కనిపించు 'పుళుమావి' పదం తెలుగుపదం. ఇది ఆంధ్ర భాషా ప్రాచీనతను నిరూపించే బలవత్తర సాక్ష్యమంటారు పరిమి రామనరసింహం. 'పుళు' పదానికి (పులు) 'గడ్డి' అని అర్థం. సుమతీశతకంలో కూడ ఈ పదం 'నలువురు నడిచెడి త్రోవల పూలు మొలవదు" అను పాదంలో కనిపిస్తుంది. 'మాయి' అంటే తల్లిపేగు 'మాయి పూర్వరూపం 'మాది' మావి మాయి అయింది. పుళుమావి అంటే (రెల్లు) గడ్డి తల్లిపేగుగా కలవాడని అంటే కార్తికేయుడు అన్నమాట అంటారు నడుస్తున్న చరిత్రలో పరిమి. శరవణభవుడను సంస్కృత సమాసానికి ఇది మంచి తెలుగు మాట. ఒక రాజు తన కుమారుని పేరుగా తెలుగుపదం వాడటమే తెలుగు ప్రజల్లో బాగా నాటుకున్న విషయాన్ని తెలుపుతోంది. పుళుమావి నాణేల మీది వాక్యాలు కూడ తెలుగు ప్రాచీనతకు మంచి సాక్ష్యాలుగా ఉన్నాయి.

సి.బి. బ్రౌన్ వంటి ఉన్నతాధికారులు వేమన పద్యాలకు ముగ్ధులై తెలుగు భాషాభిమానులుగ మారారు. భాషాభివృద్ధికి, తెలుగు సాహిత్య రక్షణకు కంకణం కట్టారు.

ఇంతటి గతవైభవం తెలుగుది అయితే తమిళాన్ని ప్రాచీనభాషగా గుర్తించాలని తమిళనాడుకు చెందిన రాజకీయ పక్షం పట్టుదలతో కేంద్రం నిపుణుల కమిటీ వేసింది. కేంద్రసాహిత్య అకాడమీ ఛైర్మన్ గోపిచంద్‌నారంగ్ నేతృత్వంలోని కమిటీ తెలుగు, సంస్కృతాలకు ప్రాచీన భాషాహోదా కల్పించాలని సిఫారసుచేసింది. అది రూపొందించిన కొన్ని నియమ నిబంధనలు--

ఆ భాష ప్రాచీనమైనదిగా ఉండాలి.

1500 నుండి 2000 సంగిరాల సాహిత్య చరిత్ర కలిగి ఉండాలి.

(మొదట్లో వేయి సంవత్సరాల లిఖిత సాహిత్యముంటే చాలనేమాట ఏకాణంచేతనో, చివరకు 2000 సంవత్సరాల వరకు లాగించబడింది.)

ఆ భాషలో అతి ప్రాచీనమైనదిగా పేర్కొనే సాహిత్యం మరోభాష నుండి అనువాదంగా ఉండకూడదు. ఇవీ ప్రధాన నిబంధనలు.

ఈ నిబంధనలు కేవలం తమిళానికి ప్రాచీనభాషాహోదా నివ్వటానికి మాత్రమే రూపొందించ బడినట్లు ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది.

కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి నేతృత్వంలోని కేంద్రసాంస్కృతికశాఖ ఓ భాషకు కేవలం 1000 నుండి 1500 ఏళ్ళనాటి పురాతన సాహిత్యం ఉంటే సరిపోతుందని నిబంధనను సవరించినట్లు దానికి నిపుణులకమిటీ అభ్యంతరం చెప్పినట్లు తెలుస్తోంది. 2004వ సంగి సెప్టెంబరు 17న తమిళభాషను విశిష్ఠ (ప్రాచీన) భాషగా గుర్తించినట్లు ప్రకటించబడింది. ఆనాటి ప్రకటనలోనే ఈ అర్హతలు కలిగి ఉన్న ఇతర భాషలేమైనా ఉంటే ఆ భాషావ్యవహర్తలడిగితే వాటిని కూడ ప్రాచీన భాషలుగా గుర్తిస్తామని ప్రకటించారు. తెలుగు, కన్నడ భాషలకు ఆ అర్హత లభించాలి.

కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం తమ కూటమిలోని ఒక రాజకీయ పార్టీని సంతృప్తి పరచటానికి తీసుకొన్న అనాలోచిత నిర్ణయం ఇతర భాషాభిమానులకు మనస్తాపం కలిగించింది. ఇది భాషలమధ్య అనారోగ్యకర వాదనలకు దారితీసింది. కేవలం సంస్కృత, తమిళ భాషలను పురాతన భాషలుగా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వునివ్వటం ఇతరులకు బాధ కలిగించింది.

తమిళంలో ప్రాచీనసాహిత్యంగా పేర్కొనే సంగసాహిత్యం క్రీ.పూర్వం ఒకటో శతాబ్దం నుండి క్రీస్తుశకం మూడవ శతాబ్దం మధ్య వెలువడిందని ఎక్కడుంది. తమిళ విద్వాంసులు అభిప్రాయ పడుతుంటారు. తొల్కాప్పియం తర్వాతది. అదీ, దాంతోపాటు తిరుక్కురళ్, శిలప్పదికారం, మణిమేఖలై వంటి సంగీత యుగపు కావ్యాలు అనువాదాలు కావని కూడ చెప్తారు. భారతీయ సాహిత్యానికీ ఒక కొత్త దృక్కోణం చూపిన తమిళ భక్తి సాహిత్యం కూడ క్రీ.శకం ఏడవ శతాబ్దం నుండే వచ్చినట్లు తెలుస్తోంది. ఏదేమైనా తమిళంలో పురాతన సాహితీ సంపద పదిలంచేయబడటం మిగిలిన భాషలకంటే ముందే జరిగినట్లు తెలుస్తోంది.

అయినా ప్రాచీన సాహిత్యాన్ని కాపాడి ముందుతరాలకు అందించడం ప్రతిభాషకు అవసరమే కేవలం 1, 2 భాషలకు మాత్రమే ప్రాచీన హోదా యిచ్చి నిధులను కేటాయిస్తే మిగిలిన వారు చూస్తూ ఊరుకోవడం న్యాయమనిపించుకోదు. రాజ్యాంగ సమానత్వానికిది విరుద్ధం. తమ భాషలకు చెందిన ప్రాచీన సాహిత్యాన్ని కాపాడుకొనవలసిన బాధ్యత ఆయా భాషల ప్రజలందరిపైన దిశాదాల. ఏ స్వల్ప ప్రయోజనాలకో భాషలకు ప్రాచీనహోదా కల్పించడం అనేక విపరిణామాలకు దారితీస్తుంది. అన్ని భాషల అభివృద్ధిని కోరుకొని నిధులను కేటాయించటం కేంద్ర ధర్మం, కాని మరోరూపంలో భాషా దురభిమానాలకు కాని, భాషా ద్వేషాలకు కాని పెంచి పోషించడం సబబుకాదు.

ఎవరెన్ని చెప్పినా బెంగాలీలలో తమిళంలోగల స్వభాషాభిమానం తెలుగు వారికి లేదనేది వాస్తవమంటారు తుర్లపాటి వారు. $2^1/_2$ సం॥రాల క్రితం తమిళనాడు ఎం.పీలు తమ రాజకీయ విభేదాలను కూడ విడనాడి తమిళ భాష ప్రాంతీయ భాషలన్నింటిలోకి ప్రాచీనమని అందువలన దానిని ప్రాచీనభాషగా గుర్తించాలని అంతేకాక జాతీయ స్థాయిలో ద్వితీయ అధికార భాషా ప్రతిపత్తి ఇవ్వాలని కూడ కోరారు. ఈ వార్త పత్రికలలో చూచిన సీనియర్ పాత్రికేయులైన తుర్లపాటివారు 'తెలుగు 15 కోట్ల మంది మాట్లాడే భాషని అందువలన హిందీ తర్వాత తెలుగును భారత దేశ అధికారభాష చేయాలని కోరటం జరిగింది. - తెలుగునకు 3 వేల సం॥ పైబడిన చరిత్ర వుందని అందువలన ప్రాచీన భాషా ప్రతిపత్తికి తెలుగు తగినదని స్పష్టం చేయటం కూడ జరిగింది. కాని తమిళ భాషకే ప్రాచీన భాషా ప్రతిపత్తి లభించింది.

మూల ద్రావిడ భాషల్లో ఒకటైన తెలుగుకు భారతదేశంలో ప్రాచీన భాషగా గుర్తింపు పొందడానికి అర్హతలు లేవా? చాలా ఉన్నాయి.

క్రీస్తుశకం 7వ శతాబ్దంనాటి ఎర్రగుడిపాడు శాసనం, 848 నాటి ప్రకాశం జిల్లా అద్దంకి శాసనం తెలుగులో ఉన్నాయి.

పురూరవ చక్రవర్తి కాలం నుండే సింహాచలం అప్పన్న ఆలయంలో తెలుగు భాషకు గుర్తింపు కన్పిస్తోంది. ఆరవ శతాబ్దంనాటికే అప్పన్న ఆలయం సింహగిరిపై నిర్మించి ఉన్నట్లు చరిత్ర చెప్తోంది. 2, 3 శతాబ్దాలలోనే ఆలయ నిర్మాణం జరిగి ఉండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయం. ఆనాటి నుండి తెలుగుభాష వాడుకలోనున్నట్లుగా ఇక్కడ గుర్తులున్నాయి. పుట్టలో ఉన్న సింహాద్రి అప్పన్నను బయటకుతీసి సింహగిరిపై చందనోత్సవం నిర్వహించిన పురూరవ చక్రవర్తి కాలంలో కూడ ఇక్కడ తెలుగుభాష వ్యవహారం కలదని చరిత్రకారుల కథనం.

క్రీ.పూర్వం 6వ శతాబ్దికే అస్తిత్వం కలగిన జాతి క్రీ.శ. 11వ శతాబ్దం వరకు సాహిత్యం లేకుండా ఉందంటే అది సత్యులేని విషయం. ఏ జాతయినా మాట్లాడుతూ సాహిత్యం లేకుండా అంతకాలం వుంటుందా! అని ప్రశ్నిస్తారు. కత్తిపద్మారావు.[5] మొదటి నుండి తెలుగు రాజతి అనేక ఆటుపోటులను ఎదుర్కొన్నది. రాజకీయ, మత, అంటు జీవితంలో భాగంగా సాహిత్యాన్ని కోల్పోయింది. ఒక భాష యొక్క పూర్వకాలం నిర్ణయంచేదిప్పుడు ఆ జాతి చరిత్రకూడ పరిశీలించాలి. తెలుగుభాషను ప్రాచీన భాషగా గుర్తింపక పోవడం చారిత్రక నిర్లక్ష్యం అంటారు పద్మారావు.

అటు భాషా ప్రమాణాల రీత్యా ఇటు సంఖాధిక్యతరీత్యా ఇతర భాషావేత్తల అభిప్రాయానుసారం హిందీ తర్వాత భారతదేశానికి అధికార భాషకాగల అర్హత కూడ తెలుగుకే చెందుతుంది.

తెలుగు భాషకు 2 వేల సం॥రాల చరిత్ర ఉందని పలు ఆధారాలతో పెద్దలు నిరూపించారు.

రామాయణ, భారత, భాగవతాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలవంటి అమూల్య ప్రాచీన సాహిత్య సంపదగల భాష తెలుగు.

కవిత్రయం భారతాన్ని స్వతంత్ర కావ్యంగానే తీర్చిదిద్దారు.

శతక సాహిత్యం, అవధాన సంపద తెలుగుభాష సొత్తు.

తమిళ భాషలో 'సంగతి' కాలానికి చెందిన సాహిత్యం ఇంగ్లీషులో అందుబాటులో ఉంది. తెలుగు భాషా స్వరూపానికి సంబంధించిన ప్రాచీన సాహిత్య విషయాలే ఆంగ్లంలోకి అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం తెలుగు పండితులు అంతగా చెయ్యలేదు. అందువలన ద్రావిడ భాష గురించి చెప్పే ప్రతిసారీ పరిశోధకులు తమిళ భాషా పదాలే ఉదాహరించడంతో ద్రావిడ భాషంటే తమిళమేననే అభిప్రాయం బలపడింది. అయినా క్యాపర్, ఎమెనో, బరో లాంటి పండితులు వెలికితీసిన మూల ద్రావిడ రూపాలు కన్నడ తమిళాలకన్న తెలుగు భాషకే దగ్గరగా వున్న సంగతి స్పష్టం చేస్తున్నాయి. తెలుగు ప్రాచీనతకు నిలువెత్తు సాక్ష్యంగా వరి పదం నిలిచింది. లాటిన్ భాషలో 'ఒరైజా సెటైనా' అనే వృక్షనామం వరియొక్క కేర్పడటానికి 'వరి' అనే తెలుగు పదమే కారణమని మైకేల్ విజ్జెల్ సశాస్త్రీయంగా నిరూపించారు ('నడుస్తున్న చరిత్ర' ఆగస్టు సంచిక)

నన్నయకు పూర్వపు గొప్ప బౌద్ధజైన వాఙ్మయం మత ఘర్షణల కారణంగా కోల్పాయయని సాహిత్య విమర్శకుల అభిప్రాయం. తనకంటె ముందు అనేక శతాబ్దాలుగా కవిత్వ రచనా సంప్రదాయం లేకపోతే నన్నయ అంతటి గొప్ప సాహిత్య సృష్టి చేయగలిగే వాడు కాదుకదా!

వెయ్యి సం॥రాల నిబంధనైనా రెండు వేల సం॥రాల నిబంధనైనా శ్రేష్ఠభాషగా గుర్తింపు పొందడానికి తెలుగునకు పూర్తి అర్హత ఉన్నదనే ప్రపంచ ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి స్పష్టం చేశారు. భాషా శ్రేష్ఠతను నిర్ణయించటానికి లిఖిత సాహిత్యాన్నే కాకుండా శాసనాలు, ఇతర భాషా సాహిత్యాలలో కనిపించే పదాలవంటి ఆధారాలను కూడ పరిగణనలోనికి తీసుకోవాలనేది వారి అభిప్రాయం.

తెలుగునకు ప్రాచీన భాష హోదా కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్రాశాసన సభ తీర్మానం చేసింది. ప్రాచీన భాషగా తెలుగును గుర్తింపజేయడానికి అవసరమైన ఆధారాలను సమీకరించడానికి టాస్క్‌ఫోర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇదే విషయమై హైకోర్టులో తెలుగుదేశం పార్టీ రిట్ దాఖలు చేసింది. తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంపొందించటమే తమ ఉద్దేశ్యమని పార్టీ నాయకులు పలికారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు దీని విషయమై దాఖలు చేసిన ప్రజా ప్రయోజనవ్యాజ్యాన్ని రాష్ట్ర హైకోర్టు విచారణకు స్వీకరించింది.

గత సం॥రం తెలుగునేల నాలుగు చెరగులా తెలుగును సంపన్న ప్రాచీన భాషగా గుర్తించాలని వాడివేడి ఉపన్యాసాలు, చర్చలు తర్జనభర్జనలు జరిగినాయి. ఢిల్లీలోని ప్రముఖులను, సాంస్కృతిక సంబంధాల మంత్రిని, ప్రధానమంత్రిని కలిసి విన్నపాలు సమర్పించిన మన నాయకులు పార్లమెంటు సభ్యులు ఆ విషయం మరిచిపోయారు.

ఈ గుర్తింపు గౌరవం వలన కలిగే ప్రయోజనమేమిటి? లేనందువలన నష్టమేమిటి? అని ప్రశ్నించే వారూ లేకపోలేదు. ప్రాచీన భాషగా గుర్తింపు లభించడం వలన భాషకు ప్రత్యేక గౌరవం దక్కుతుంది. భాషాభివృద్ధి కేంద్రం నుండి అందే నిధులతో దేశ విదేశాలలో తెలుగు భాషా కేంద్రాలు నెలకొల్పుకోవచ్చు. మన విలువైన సాహిత్యాన్ని పదిలం చేసుకోవచ్చు.

ఒక భాషకు శ్రేష్ఠ భాషగా గుర్తించడానికి ఈ క్రింది నిబంధనలు భారత ప్రభుత్వం అంగీకరించినట్లు తెలుస్తోంది.

1. కనీసం వెయ్యి సంవత్సరాల ప్రాచీనమైన తొలినాటి లేఖనాలు చారిత్రక అక్షరాల సంపద ఉండాలి.
2. తరువాతి తరాలవారు విలువైన వారసత్వంగా పరిగణించే ప్రాచీన సాహిత్యం ఉండాలి.
3. ఇతర భాషాప్రమాణాలనుండి సాహిత్య సంప్రదాయం మౌలికంగా ఉండాలి.
4. శ్రేష్ఠ భాషలా ఆధునిక భాషకు లేదా దాని ఇతర రూపాలకు మధ్య అంతరాయం ఏర్పడి

ఏ కొలమానాలు ప్రభుత్వాలు స్వయంగా అన్నిటి ఆంక్షలను తట్టుకొని నిలబడి తన శక్తిని నిరూపించుకొనగలసత్తా మన తేట తెలుగు భాషకున్నది. గుర్తింపుకోసం ఇంకొకరిని చేయి చాచే దౌర్భాగ్యం నుండి తెలుగుజాతిని భాషను తప్పించాలి.

# జెన్ - లకాన్

- మ. శివరామకృష్ణ

జెన్ తత్వం విశ్లేషణ చేసిన వాళ్ళల్లో D.T. Suzuki అగ్రగణ్యుడు. ఆయన వ్రాసిన వాటిలో 'Essays in zen Buddhism' (నాకు దొరికినవి రెండు సంపుటాలు) పాశ్చాత్యుల దృష్టిని జెన్ వైపు మళ్ళించటంలో ప్రముఖమైన స్థానం సంపాదించింది. అధికారికంగా విషయాన్ని వివరించటంలో సుజికికి సాటైన వాళ్ళు చాలా తక్కువ. జెన్ అంటే తెలుసుకొనటానికి ఆయన ఉదాహరించిన ఒక "కథ" చక్కగా పనికి వస్తుంది : "A monk asked his master, "who is the Buddha ?" "The dried - up dirt - cleaner." This is the remedy ; whether you are walking or sitting or lying let your mind be perfitually fixed on this 'dirt - cleaner'. The time will come when your mind will suddenly come to a stop like an old rat who finds himself in (a corner without exit). Then there will be a plunging into the unknown with 'Ah, this!' when this cry is uttered you have discovered yourself."

చాలా సూక్ష్మం, మార్మికం అయిన కథ. జెన్ అనుయాయులు, గురువులు ఏ రకమైన - తార్కికమైన - సమాధానాలకి లొంగని కథలు చెప్పటంలో అగ్రగణ్యులు. స్థూలంగా చూస్తే "తలా తోకా" ఉండని కథలు. అంటే జెన్ కి ఒక "బండ గుర్తు" మేధానుభవానికి లొంగినా, సమగ్రం, సహేతుకం అయిన సమాధానానికి తావివ్వకపోవటం. అంటే తార్కికమైన విశ్లేషణని కించపరచటం కాదు. "పరమార్థం" ఏ విశ్లేషణకి లొంగని, వాచ్యం చేయటానికి వీల్లేనిది అని సూచించటానికి ప్రాధాన్యం ఇస్తుంది జెన్. ఒక తమాషా పుస్తకం ఉంది. దానిపేరు If you Find the Buddha on the Road, Kill Him ! అని (రచయిత Stephen Mitchell, నాకు జ్ఞాపకం ఉన్నంత వరకూ). దీని అర్థం బుద్ధుడి తత్వాన్ని జీర్ణించుకొనటానికి బాహ్యంగా అన్వేషించద్దు. అంతరంగంలో ఆ 'పని' కొనసాగాలి అని. బుద్ధుడి బోధనల సారాంశం హృదయంలో గూడుకట్టుకోవాలి. బయటకాదు అని అన్వయం.

ఈ రకమైన అన్వయానికి మరొక పేరు ధ్వని. సాహిత్యపరంగా చూస్తే, మరి బుద్ధుడు "చెత్తా-చెదారం బాగుచేసే, శుష్కించిన, ఎండిపోయిన (వ్యక్తి)" అని చెప్పటం తికమక పరచే సమాధానం. అంత పునీతం అయిన మహానుభావుణ్ణి ఈ రకంగా వర్ణించటం అపచారం, అగౌరవం కాదా! మరి గురువు "ఎవరు బుద్ధుడు?" అని అడిగితే శిష్యుడికి ఈ విధంగా ఎందుకు సమాధానం చెప్పాడు? మొదట మనకి కలిగే అనుభవం షాక్ అదే జెన్ తత్వానికి కావలసింది. మనసంతా (చేతన - అచేతన తారతమ్యం ఏ మాత్రం లేకుండా) ఆలోచనల, ఉద్వేగాల, ఉద్రేకాల, ఊహల చెత్తాచెదారంతో నిండి ఉన్న ఒక అగాధం. Unfathomable pit. అచేతన మానసిక కోశం అంతా దీనితో నిండి ఉంటుంది. దాన్ని శుద్ధిచేసే, సరైన మార్గానికి మనసుని మళ్ళించే చైతన్య శక్తి దాల్చిన భౌతిక రూపమే బుద్ధుడు. ఇటువంటి వ్యక్తుల్ని "Sweepers of Sorrow" అన్నారు మా Mentor 'శ్రీరామ్'.

పైగా పైన చెప్పిన కథలో అటువంటి బుద్ధుడి గురించి ఏ విధంగా ఆలోచించాలి? "అదే పరిష్కారం. నడుస్తున్నా, కూర్చున్నా, పడుకున్నా ఆ బుద్ధుడి పైననే ఉండాలి ఆలోచన అంతా" అంటాడు గురువు. Perpetually అంటే ఏ అంతరాయం లేకుండా. "తైలధావకత్" అంటుంది యోగ సిద్ధాంతం. ఒక పాత్రనుంచి మరొక పాత్రలోకి నూనె ధారగా పడుతున్నట్లు. మరి మానసిక విశ్లేషణ పద్ధతిలో పరిశీలిస్తే, Lacan చెప్పిన అంశం ఈ "ప్రక్రియకి" - ఏ అవరోధం లేకుండా ధ్యానించటం / ఆలోచించటం - ఒక సమాధానం. "The unconscious, it is said, - in a tone that is all the more know-

ప్రొ. మ. శివరామకృష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల శాఖాచార్యునిగా పదవి విరమణ చేశారు. హైదరాబాదు.

ing the less the speaker is capable of justifying what he means - the unconscious needs time to reveal it self. అందుకే నిరంతర ధ్యానం, ఆలోచన.

ఇక్కడ ఒక తేడా మనకి స్పష్టంగా కనిపిస్తుంది. జెన్‌లో ఒక analyst (psycho) చేసేపని మన మనసే చేస్తుంది. ఏ psychologist అవసరం లేదు! పైగా psychologist కి మానసికంగా పరిణతి ఉండచ్చుకాని, తన మానసిక సమస్యలని పరిష్కరించుకొని ఒక సమగ్ర వ్యక్తిత్వం రూపొందించుకున్న వ్యక్తి కాకపోవచ్చు. Alfred Hitcock 'తీసిన' ఒక సినిమా అనుకుంటా. అందులో ఒక mentally disturbed person, psychoanalyst దగ్గరకు వెళతాడు. "సమావేశం" - session - కొంతసేపు అయిన తర్వాత ముగుస్తుంది. ఆ తర్వాత తమాషా ఏమిటంటే ఆ psychoanalyst మరొక తనలాంటి మానసిక వైద్యుడి కోసం వెతకటానికి వెళతాడు. ఇదే Lacan చెప్పిన "all the more knowing" psychoanalyst అని వ్యంగ్యంగా చెప్పటానికి కారణం.

మరొక అంశం కూడా పైన చెప్పిన కథలో గమనిస్తాం. నీ మనసు అకస్మాత్తుగా ఆగిపోయే సమయం వస్తుంది" అని చెపుతాడు Zen Master. Lacan "the unconscious needs time to reveal itself" అని చెపుతూనే, "how is this time to be measured ?" అన్న ప్రశ్న లేవదీస్తారు. Clocks ప్రకారమా? లేక కాలాతీత చైతన్యం మూర్తీభవించిన బుద్ధుడిలాంటి "dirt - cleaners" ల ప్రకారమా? అంటే dirt - cleaning జరిగి, purified consciousness పునీతం, పవిత్రం అయిన చైతన్యం ఎప్పుడు - కాల పరిధిలో - ఆవిర్భవిస్తుంది? ఇక్కడే ప్రత్యేకత. ఎప్పుడైతే గురుడు చెప్పిన సమాధానం మనస్సుని, మానసిక ప్రక్రియలని shock చేస్తుందో, ఆక్షణమే పరిష్కారం - solution - దొరికిన క్షణం. అయితే ఇది తాత్కాలికం కాదు. శాశ్వతమైన పరిష్కారం.

జెన్‌లో దైవంతో పనిలేదు. దీనికి చిత్రంగా రమణ మహర్షి జీవితంలో ఒక ఉదాహరణ ఉంది. ఒక జిజ్ఞాసి ఎక్కడెక్కడో తిరిగి, కనిపించిన సాధువునల్లా "నాకు భగవంతుణ్ణి చూపించగలవా? నువ్వు చూసావా? " అని అడిగేవారు. ఎవ్వరూ సంతృప్తికరమైన జవాబు ఇవ్వలేదు. ఆఖరికి రమణ మహర్షి దగ్గరకు వస్తాడు. అదే ప్రశ్న వేస్తాడు. మహర్షి కొంతసేపు మౌనంగా ఉంటారు. ఆ తర్వాత : భగవంతుణ్ణి చూపటం సంగతి అట్లా ఉంచు. నువ్వే భగవంతుడిగా ఉండటం ఎలా సాధ్యమో చూపుతా" అంటారు. "I can show you how you can yourself be God" "Be God yourself" అంటారు.

ఈ నేపథ్యంలో ధ్వని సిద్ధాంతానికీ, జెన్‌కీ, లకాన్‌కీ మధ్య ఉన్న ఆంతర్యమైన సంబంధం కొంత స్పష్ట పడుతుంది. స్థూలంగా చూస్తే ధ్వని అలంకార సిద్ధాంతం, జెన్ ఆంతరంగికమైన, ఆధ్యాత్మిక మార్గం. ఇక లకాన్ ఒక psychoanalyst - cum academic. మరి ముగ్గురి మధ్యా తేడాలుంటాయికదా ! psychoanalytic process కి, అలంకార సిద్ధాంతానికీ, ఆధ్యాత్మిక మార్గానికీ తేడాలు లేవా? అన్న ప్రశ్న తప్పకుండా తలెత్తుతుంది. మూడూకూడా ఒకే దారంతో ముడిపడినవి అన్న అంశం చాలామంది ఒప్పుకోరు. కాని ఈ మూడూ కూడా దుఃఖం ఎట్లా తొలగించుకోవాలి అన్న సమస్యకి తమతమ మార్గాలు చూపించినా, ముఖ్యమైన - దాదాపు ఒకే - లక్ష్యం దుఃఖ నివారణ, సుఖప్రాప్తి. పైగా అన్నీ 'కావున' - desire - అన్న root ని పరిశీలించే పద్ధతులే.

ఒక నాటకం చూస్తాం. పాత్రల దుఃఖం పంచుకుంటాం. కాని ఆ భాధలో ఆనందం ఉంది. అదే విధంగా మానసిక సమస్యల పరిష్కారం చూపుతాను psychoanalyst. కాని రెండూ కలిగించే అనుభవాలు శాశ్వత పరిష్కారాలు కావు. అందుకే అవి తాత్కాలికంగా సాంత్వన కలిగించే tranquillizers. మూడోది ఆ రెండు మర్గాల పద్ధతులని, ప్రక్రియలని తనలో ఇముడ్చుకొని మరొక

మెట్టు ఎక్కిస్తుంది. దుఃఖాన్ని తుదముట్టించదు. సుఖం - హద్దులుమీరి - దుఃఖానికి కారణం కాకుండా చూస్తుంది.

ఈ మధ్య past-modern thinkers కి Indian philosophers కి ఉన్న సామ్యాలు, విభేదాల గురించిన చర్చ చాలా జరుగుతోంది. పైగా ఆధ్యాత్మిక మార్గాలని బొత్తిగా తీసి వేయటం అహేతుకం, అప్రాకృతం అన్న నిశ్చయమైన నిర్ణయం కనిపిస్తోంది. Carlolson వ్రాసిన Indian Philosophers and postmodern thinkers (oxford, 2002) అన్న పుస్తకం చాలా సమగ్రమైన పరిశీలన. ఈ చర్చల్లో ప్రముఖమైన అంశం Desire and its nature. కావున, దాని ప్రకృతి. Desire అణచివేస్తే మానసిక వైకల్యం, జాడ్యం. విశృంఖలంగా వ్యక్తీకరిస్తే అరాచకం, అప్రాకృతం. ఏది పరిష్కారం?

ఈ పరిష్కారం ఒక్క psychoanalysis లోనే దొరకదు. అది ఎంతగా తికమకలు పడి వాదించినా, దాదాపు అందరూ అంతో ఇంతో అంగీకరించే వాస్తవం. అందువల్ల desire nature తెలుసుకుంటే పరిష్కారం సమగ్రమవుతుంది. జెన్ దీనికి ఒక మార్గం. దీనికి ఒక ప్రత్యేకత ఏమిటంటే ఏ భగవంతుడిపట్ల విశ్వాసం అవసరం లేకుండా "పని చేయటం." కాని Olson ఒక మంచి సూచన చేస్తాడు. శంకరాచార్యుల వారికి లకాన్‌కి మధ్య సామ్యం, భేదం చెపుతూ Carlolson వ్రాస్తాడు: "Lacan and sankara agree that difference is necessary for the development of desire. They disagree when Lacan claims that Loe are ignorant about our desires and sankara argues that, rather, we are ignorant about the nature of our true self." కామనకి కామించే ఒక వస్తువు, వ్యక్తి ఏదో ఒకటి ఉండాలి. అంటే difference between desire and the desired object, person, experience. ఈ విషయం ఇద్దరూ - ఆచార్యశంకరులు, లకాన్ అంగీకరిస్తారు. అయితే మన కామనల పూర్తి స్వభావం గురించి మనకి సమగ్రమైన జ్ఞానం లేదు అని లకాన్ వాదిస్తే, మన వాస్తవమైన self (ఆత్మ?) గురించి మనకి అవగాహన లేదు అని ఆచార్య శంకరుల విశ్వాసం (ఒక విధంగా ఆయన అనుభవం కూడా.)

ఇంతకీ ఈ భేదాలు అటుంచి సగటుమనిషి ఏంచేయాలి? శబ్ద, రూప చమత్కారాలతో సరిపెట్టుకోవాలా? అపుడు పరోక్షంగా సాహిత్యం, కళల ద్వారా కొంత సంతృప్తి కలుగుతుంది. లేదా అసలు కోరికలే తప్పు. వాటిని పూర్తిగా అణచివేయాలి అని ప్రయత్నించి, నెగ్గలేక mental hospital కి వెళ్ళాలా? ఇక్కడ జెన్‌తో పాటు అభినవ గుప్తుడితో కూడా లకాన్‌కి సంబంధం ఉంది అంటాడు Carlolson.

ఇదే మనం (విపస్సనతోపాటు) పరిశీలించాల్సిన అంశం వచ్చే సారి.

ఈలోగా ఈ జెన్ కథ గురించి ఆలోచించండి.

Once when Yakusan was sitting, Sekito saw him and asked, "what are you doing here"

Yakusan said, "I'm not doing anything."

Sekito said, "Then you are just sitting idly."

Yakusan said, "If I were idly sitting, that would be doing something."

Sekito said, "You said that you are not doing, what aren't you doing ?"

Yakusan said, "Even the saints don't know? "

(from Nine-Headed Drugon River : zen Journals
by Peter Mathiessen; Baston: Shambhala, 1998; p.217.)

# కళాతాత్త్విక సిద్ధాంత ఆవిష్కరణ అవసరం

- డా॥ ఎ. రవీంద్రబాబు

ఒక ప్రత్యేక సమాజ స్వరూప స్వభావాన్ని అర్థం చేసుకొని నిర్మాణక్రమాన్ని విపులీకరించుకోడానికి తాత్త్విక సిద్ధాంతాల అవసరం ఎంతైనా ఉంటుంది. అయితే ఆ సమాజం ఏకాలం నాటిది? ఎటువంటి సమాజం? దాని స్వరూపం ఎలా ఉంది? అని తెలిసిన తర్వాత తెలిసిన తాత్త్విక సిద్ధాంతాన్ని అన్వయించడం లేదా ఆ సమాజ స్థితిని బట్టి కొత్త సిద్ధాంతాన్ని తయారు చేయడం కాని జరుగుతుంది, అలా జరగాలి. పరిణామంలో ఏది ఉన్నతమో, ఏది అర్థరహితమో, ఏది అవసరమో తేల్చి కొత్త తరం తత్త్వవేత్తలు, సమాజ పరిశీలకులు పాతవాటిని సమూలంగా మార్చడమో, అట్లానే అన్వయించి కొన్ని మార్పులు సూచించడమో చేసి తమ ప్రతిభను చాటుకుంటారు. ఒక నిర్దిష్ట కాలంలో ఒక ప్రత్యేక సమాజ స్వభావాన్ని బట్టి, తత్త్వవేత్తలు, వారి ఆలోచనా పరిధులను బట్టి, వారిపైగల ప్రభావాలను బట్టి ... ఇలా అనేకానేక వైపరీత్యాల వలన ఒకే సమాజంలో విభిన్నమైన, విరుద్ధమైన, ఆధారాదేయమైన సిద్ధాంతాలతో సమాజాన్ని నిర్వచిస్తూ, వారనుకునే పురోభివృద్ధి మార్గాలను సూచిస్తూ ఉంటారు. వీలైనంత వరకూ సమాజం వాటిని అనుకరిస్తూ, ఆచరిస్తూ ఉంటుంది అనడం సబబు.

అయితే ఒక సమాజాన్ని నిర్దిష్ట కాలంలో అవగాహన చేసుకుని సమగ్ర సత్యాన్ని ఆవిష్కరించగల ఒక్క జ్ఞాన, తాత్త్విక సిద్ధాంతమూ ఉండదు. ఎవరు నమ్మిన సిద్ధాంతానికి వాళ్ళు పునాదులు తవ్వుకొంటూ, పూడ్చుకొ ంటూ తత్త్వవేత్తలు, అనుకర్తలు ఉంటారు. ఉదాహరణకు గురజాడ అప్పారావు "మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలచిపోవును" అన్నమాటను ఖండాలుగా విపులీకరిస్తే కొన్ని ప్రశ్నలు ఎదురవుతాయి. గురజాడ దృష్టిలో మతమూ, ఆనాటి, ఇప్పటి ప్రజల అందరి దృష్టిలో 'మతము' ఒక్కటేనా? ప్రపంచంలో, ఆంధ్రదేశంలోని మతాల నేపథ్యాలు వేరు కాదా? మరి 'జ్ఞానం' అంటే ఏమిటి? ఎవరికి అందిన జ్ఞానం? జ్ఞానం సార్వకాలికమా?! అభివృద్ధికి, అందరి అభివృద్ధికి మూలహేతువా? అసలు అలా సాధ్యమా? ఇటువంటి ప్రశ్నలే కొంత మార్పుతో ప్లేటో ఆదర్శ రాజ్యానికి, మార్క్స్ వర్గరహిత సమాజానికి, ప్రపంచీకరణ కుగ్రామానికి, మతాలు చెప్పే యుగాంత పరిష్కారానికి అన్వయించుకొంటే వచ్చే సమాధానాల ఫలితాలు ఎవరిని తృప్తి పరచగలుగుతున్నాయి? ఎంత మందిని తృప్తి పరచగలుగుతాయి?

సోవియట్ రష్యాలో వ్యవసాయ సమిష్టీకరణ రక్తపాత రహితంగా, స్వచ్ఛందంగా జరిగిందా? ఇప్పటికీ మత మార్పిడులు స్వచ్ఛందంగా జరుగుతున్నాయా? అలా జరిగితే మత ఘర్షణలనూ విశ్లేషించుకోవాలి. భారత దేశానికి ప్రజాస్వామ్యం అనుకూల రాజకీయ తాత్త్విక సిద్ధాంతమా? అలా అయితే సాధించిన అభివృద్ధి ఎంత? ఎవరికి అందుతుంది? అభివృద్ధి అన్న పదం సరైనదేనా? అంతా మంచిగా ఉంది అనుకుంటే వివిధ రాజకీయ సిద్ధాంతాల నేపథ్యంతో జరిగే పోరాటాలను, ఉద్యమాలను గుర్తించకుండా ఉండలేముకదా. రోజూ జరిగే ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను గమనిస్తూనే ఉన్నాం. నేటి పరిస్థితి ప్రజాస్వామ్యం ప్రజల అభీష్టమని చెప్పలేని సంఘటిత స్థితి.

---

డా॥ ఎ. రవీంద్రబాబు, హైదరాబాద్ యూనివర్శిటీ, హైదరాబాదు - 46.

శాస్త్రీయతని, హేతువుని ముందుకు తెచ్చిన ఆధునిక దశను పునరాలోకనం చేసుకుంటే వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఏ దేశంలో నైనా పూర్తిగా దొరకవు. సత్యం ఎప్పుడూ సార్వజనీనం. సార్వకాలికం కాదు. సత్యాన్ని-శాస్త్రీయతను పరిణామంలో ఒక నిర్దిష్ట దశకు చిహ్నంగా మాత్రమే గుర్తించగలం. ఒక కాలంలో ఒక సమాజంలో కొంత మానవాళికి భౌతికావసరాలు అన్నీ ఒకే రకంగా తీరుతున్నా వారి ఆలోచనా ధోరణి భౌతిక సాకారాల నుండి ఉద్భవించినప్పటికీ భిన్నత్వాన్ని - వైయక్తికతను కలిగి ఉంటాయి.

మానవతావాదాన్ని ఎలా నిర్వచించుకోవాలో, ఎవరికి ఆపాదించి సార్వకాలికం, సార్వ జనీనం చేయాలో అర్థం కాని విషయమేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

గ్లోబలైజేషన్‌కు మకుటమైన అమెరికాలోని నల్లజాతీయుల స్థితిని ఎలా అంచనా వేయగలము? భౌతికావసరాలు, మానసికావసరాలలో మర్చిపోయిన వాటిని వ్యతిరేకంగా గ్లోబలైజేషన్ ముందుకు తెచ్చింది. సమాజంలోని ప్రజల అందరికి ఒకే విధంగా భౌతికావసరాలను తీర్చడం ఎవరికీ, ఏ సిద్ధాంతానికీ సాధ్యం కాలేదు. అందుకే పూర్వం నుండి పోరాటాలు, యుద్ధాలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడూ అదేస్థితి.

నిర్దిష్ట సమాజంలోని విభాగాలను, భిన్నత్వాలను, వైరుధ్యాలను పరిశీలిస్తే ; మతం, కులం, రాజకీయం, ఆర్థికం, వర్గం, మానసికం, లింగం ఇలా అనేకాలుగా ఆంధ్రదేశాన్ని చూడవచ్చు. ఒక్కొక్క భాగంలో మరలా సైద్ధాంతిక, స్వభావాలతో కూడిన చిన్న చిన్న ఉప విభాగాలూ కనిపిస్తాయి.

సాహిత్యాన్ని పరిశీలిస్తే ; రూప పరంగా పద్యం, వచన కవిత, కథ, నవల, నాటకం, గేయాలు మొదలైనవి. వస్తు పరంగా చూస్తే ఆధునికతకు యుగకర్తగా చెప్పే గురజాడ నుండి కాల్పనిక, అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీ, మైనారిటీ, ప్రపంచీకరణ వ్యతిరేకోద్యమాలు, నవ్య సంప్రదాయోద్యమం ఇలా ఎన్నో ఉన్నాయి. పై రూప, వస్తు విభజనలతో కూడిన సాహిత్యం అంతా నేటి ఆంధ్రదేశంలో వెలువడటం కొంత ఆశ్చర్యాన్ని కలిగించని విషయమే. ఈ విభిన్న సాహిత్యాల వాస్తవ సత్యాలను ఎలా అర్థం చేసుకోగలం. ముఖ్యంగా నేడు సాగుతున్న ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమాలను గుర్తించాల్సిన అవసరం ఎంతో ఉంది.

భాష, భాషణం సంకేతాలతో కూడిన సంజ్ఞలు. వీటిని ప్రతిఫలింప జేస్తూ ముందుకొచ్చింది ఎలక్ట్రానిక్ రంగం. ఈ రంగం ప్రారంభం ఆధునికతమీద, ఆధునికతను ప్రేమగా అందిపుచ్చుకున్న/కుంటున్న దేశాల భవిష్యత్తు పైన తుంటరి సవాళ్ళు విసిరింది. వీటిని సాపేక్షాలుగానే ఆయా దేశాలు గుర్తించడంలో పారదర్శకత ఉంది. సాపేక్ష అనడంలోనే ఆపేక్ష ఉండడం, మానసిక మూలాలు ద్రవ్యమూలాలలో చిక్కుకొని ఉండడం, కాంక్షలు అవసరాలుగా మార్పు చెందేలా ఎలక్ట్రానిక్ వినిమయ రంగం చేయడం ఇందుకు మౌలిక బీజాలు.

భారతదేశంలో మెట్రోపాలిటన్/సెక్స్‌వల్ సంస్కృతి నుండి అర్థ ఫ్యూడల్, పెట్టుబడీదారీ సంస్కృతి వరకు ఉన్న సమాజాన్ని ఏ సైంద్ధాంతికత పరిధిలో నిర్వచించి, విశ్లేషించగలం? సిద్ధాంతానికి మనిషి

కేంద్ర బిందువు కాలం నుండి మనిషి విచ్ఛిన్న పరిపక్వతలో సిద్ధాంతాన్ని, నిర్మించాల్సిన ఆనవాళ్ళు నేటి సమాజంలో ప్రస్ఫుటంగా ఉన్నాయి.

మనిషి బానిస, మనిషి యజమాని; మనిషి భూస్వామి, మనిషి కూలి ; మనిషి పెట్టుబడీదారి, మనిషి కార్మికుడు ; మనిషి యజమాని, మనిషి టెక్నీషియన్ (కొత్త పదబంధాల నిర్మాణం అవసరం) చివరకు మనిషి ఆలోచనలూ పరాయీకరించబడుతున్న సందిగ్ధ జ్ఞాన సమరం ఇది. వైయక్తిక దశ దాటి నిర్లిప్తత, వైరూప్యత స్థితిలో అంతమైన దన్న చరిత్రకు, సిద్ధాంతాలకూ ఉరిని సిద్ధం చేస్తున్న స్థితి ఇది. పై విచ్ఛిన్నకర క్షణాలను వర్తమానం ఆది భౌతికంగా, నిర్హేతుకంగా అశాస్త్రీయంగా భద్రపరచుకొంటుంది.

సీరియళ్ళు - వినోద కార్యక్రమాలు, పబ్స్, మీడియాలో గ్రాఫిక్స్ ప్రవేశం, డిస్కోథెక్స్. ఫ్యాషన్‌షోలు, మోడలింగ్, వైయక్తిక ఆలోచనలను నిర్ణయిస్తున్న కంప్యూటరీకరణ, కోరికలను, అవసరాలను మినిమైజ్ చేస్తున్న వస్తు వినిమయ వ్యవస్థ ఇలాంటి వన్నీ కళాతాత్త్విక రంగాలపై సాంకేతికరంగం సాధించిన ఆధిపత్యానికి చిహ్నాలుగా చెప్పవచ్చు.

అమెరికా, బ్రిటన్‌లాంటి పాశ్చాత్యదేశాలు వలసానంతర దశ తర్వాత మేధోవలసను ప్రారంభించడం గ్లోబలైజేషన్‌లో భాగం అయినప్పటికీ దీనివెనుక గుర్తించని ఆధునికానంతరవాద కుట్ర ఉంది. యుద్ధాలను మనసులతో చేస్తూ భౌతికంగా మనిషిని నిర్వీర్యం చేసి హృదయాలను, మెదడులను ఆక్రమించేలా చేస్తుంది. ఆశావాద దృక్పథం అని చెప్పలేక పోయినా మనదేశంలో అంతగా ప్రపంచీకరణ అనుకూల సాహిత్యం రాకపోవడం ఒక గొప్ప సందర్భంగా భావించవచ్చు. కానీ ప్రతి ప్రజాస్వామ్య పౌరుడు దానికి ఆకర్షితుడు అవుతున్న మాట వాస్తవం. ఇందుకు కళాకారుల జీవితమూ మినహాయింపు కాదు.

ఇటువంటి సంక్లిష్టస్థితిలో, మహా కథనాలపై దాడి ఫలితంగానైన లేక అసంపూర్ణాలని నిరూపితాలవుతున్న కాలంలో అనుకరణ సిద్ధాంతాలు కాక స్వభావ సిద్ధంగా దేశానికి తాత్త్విక సిద్ధాంత అవసరం ఎంతైనా ఉంది. ఆధునికానంతరవాదం ఆధునికత కొనసాగింపా? ఆధునికత వ్యతిరేకా? ప్రపంచీకరణలో భాగమా? అసలు అది సిద్ధాంతమా? కాదా? అనడం కంటే ఆధునికతను లోపభూయిష్టంగా, నిర్ధారిస్తూ ఎత్తి చూపిన అంశాలు ముఖ్యమైనవి. అర్ధభూస్వామ్య, అర్ధ పెట్టుబడీదారి/ ఆధునికత, అర్థ ఉత్తరాధునికత / ఎలక్ట్రానిక్ రంగం కలిసిన భారతదేశ వర్తమాన అనిశ్చిత స్థితిని భవిష్యత్ దర్శనంలో చూయించడానికి తాత్త్విక సిద్ధాంత అవసరం ఉంది. అది అన్నిటిని ఆకలింపు చేసుకున్న సహజాతంకావాలి. అది వైజ్ఞానిక సంబంధిత రంగాల నుండి కాక సామాజిక, మానవీయ దృక్కోణాలతో సిద్ధాంతీకరించ బడాలి. అది సాహిత్యాన్ని కళారంగాలను విస్తృతంగా, విభిన్నంగా పరిచయం చేసుకోగలిగి ఉండాలి.



గరుడస్తంబం క్రింద శ్రీచైతన్య

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



సంధ్యా సమయం